ప్రజాశక్తి
సోమవారం 26 జూన్ 2023 8 పేజీలు

ప్రకాశం

బాపట్ల

పాలుట్లకు వెలుగులు తెస్తా : మంత్రి

ప్రజాశకి-యర్రగొండపాలెం

నల్లమల అటవీ ప్రాంతంలో గల పాలుట్ల గిరిజన గూడేనికి త్వరలోనే విద్యుత్ సౌకర్యం కల్పించి వెలుగులు తెస్తానని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ తెలిపారు. పాలుట్ల గిరిజన గూడెంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి గిరిజనుతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అధికారులతో మాట్లాడి గిరిజనుల సమస్యలు అక్కడే పరిష్కరిం చాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి సురేష్ మాట్లాడుతూ గిరిజనులను ఫలసాయం నుంచి వ్యవసాయం వరకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానన్నారు. జగనన్న ప్రభుత్వం గిరిజనులకు అటవీ హక్కుల చట్టం ద్వారా భూములు మంజూరు చేసి ఉపాధి నిధులతో వాటిని సాగులోకి తెచ్చి పండ్ల తోటల పెంపకానికి అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రభుత్వమే బోర్లు కూడా వేయిస్తుందని చెప్పారు. గిరిజన బిడ్డలు విద్యకు దూరం కాకుడదని ఆశ్రమ పాఠశాలలు, గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేసి కార్పొరేట్ విద్యను అందిస్తున్నట్లు తెలిపారు.

గడప గడపకూలో మంత్రి సురేష్

అటవీ అనుమతులు రాగానే..

నల్లమల దట్టమైన అటవీ ప్రాంతం కావడంతో రోడ్డు నిర్మాణానికి కేంద్ర అటవీ శాఖ అనుమతి ఇవ్వడం లేదన్నారు. అందుకే నిర్మాణంలో జాప్యం జరుగుతుందన్నారు. ఖచ్చితంగా అటవీ అనుమతులు తీసుకొచ్చి పాలుట్లకు రోడ్డు మార్గం కల్పిస్తామని చెప్పారు. పాలుట్లలో అన్ని వీధులకు సిమెంట్ రోడ్లు కల్పి స్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి యువనేత ఆదిమూలపు విశాల్, ఐటిడిఎ పిఒ రవీంద్రారెడ్డి, మార్కాపురం సబ్ కలెక్టర్ సేతుమాధవన్, డిఎస్‌పి వీరారాఘవరెడ్డి, తహశీల్దారు రవీంద్రారెడ్డి, ఎఎంసి చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, ఎంపిపి దొంతా కిరణ్ గౌడ్, జడ్‌పిటిసి చేదూరి విజయభాస్కర్, వైసిపి మండల కన్వీనర్ కొప్పర్తి ఓబుల్‌రెడ్డి, డిఎల్‌డిఒ సాయికుమార్, డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్ఒ డాక్టర్ శ్రీనివాసరావు, పాలుట్ల ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్, సిఐ మారుతీకృష్ణ, ఎస్ఐ కోటయ్య, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

పేర్లే మార్పు.. అంతా బాదుడే..

- విద్యుత్ వినియోగదారులపై అదనపు భారం
- అధిక బిల్లులు కట్టలేక పేదల అవస్థలు

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

విద్యుత్ సంస్కరణల పేరుతో విని యోగదారులపై బిల్లుల భారం భారం పడుతోంది. ట్రూ అప్ చార్జీలు, ఫిక్సిడ్ ఛార్జీలు, కస్టమర్ ఛార్జీలు, సర్‌ఛార్జీలు, ఎఫ్‌పిపిసిఎ ఛార్జీల పేరుతో వినియోగ దారులపై అదనపు భారం మోపుతున్నారు. ఫలితంగా పెరిగిన విద్యుత్ బిల్లులతో సామాన్యులు, చిరువ్యాపారాలు తల్లడిల్లి పోతున్నారు. అదనపు భారం పట్ల నిరసన వ్యక్తం చేస్తున్నారు.

విద్యుత్ వినియోగదారులను ఐదు కేటగిరీలుగా విభజించి బిల్లులు వేస్తున్నారు. కేటగిరి-1లో సాధారణ ప్రజలు, కేటగిరి-2లో వ్యాపారులు, కేటగిరీ-3లో పరిశ్రమలు, కేటగిరీ-4లో యుటిలిటీస్, కేటగిరీ-5లో వ్యవసాయరంగం ఉంది.

కేటగిరీ-1లో విద్యుత్ బిల్లులు ఇలా...

మినిమం లేదా ఎనర్జీ ఛార్జీలు : వినియోగదారుడు ఖర్చుపెట్టే యూనిట్ల ఆధారంగా శ్లాబ్‌ను బట్టి ఈ ఛార్జిని లెక్కిస్తున్నారు. వినియోగదారుడు 200 యూనిట్లు ఖర్చు పెడితే మొదటి 30 యూనిట్లు రూ 1.90 చొప్పున, 31 నుంచి 75 యూనిట్లకు రూ 3 చొప్పున, 76 నుంచి 125 యూనిట్లకు రూ 4.50 చొప్పున, 126 నుంచి 225 యూనిట్లకు రూ.6 చొప్పున బిల్లులు ఇస్తున్నారు.

ఫిక్సిడ్ ఛార్జీలు : విద్యుత్ స్తంభాలు, వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ సిబ్బంది సేవలను వినియోగదారుడు ఉపయోగించు కుంటు న్నందుకు ఈ ఛార్జీలు వేస్తున్నారు.విద్యుత్, సరఫరా ఖర్చు కూడా వేరుగా చూయిస్తూ సదుపాయాలను ఉపయోగించుకున్నందుకు అద్దెగా దీన్ని వసూలు చేస్తున్నారు. కేటగిరీ-1లో కిలో వాట్‌కు రూ.10 చొప్పున కేటగిరీ-2,3లో కిలోవాట్‌కు రూ.75 చొప్పున వసూలు చేస్తున్నారు.

కస్టమర్ ఛార్జీ : వినియోగదారుల సర్వీసు చార్జిగా దీన్ని చెబుతున్నారు. దీన్ని కూడా కేటగిరీల ఆధారంగా వేస్తున్నారు. వినియోగదారుడు విద్యుత్ ఉపయో గించినా లేకున్నా దీన్ని చెల్లించాల్సిందే.

ఎలక్ట్రిసిటీ డ్యూటీ : ప్రతి వినియోగదారుడి నుంచి విద్యుత్ సుంకం పేరుతో దీన్ని వసూలు చేస్తున్నారు. దీన్ని కేటగిరీ-2,3లకు యూనిట్‌కు రూపాయి చొప్పున వసూలు చేస్తున్నారు సాధారణ ప్రజల నుంచి యూనిట్‌కు 6 పైసలు చొప్పున వసూలు చేస్తున్నారు.

ఇంట్రస్ట్ ఆన్ ఈడీ : ఎలక్ట్రిసిటీ డ్యూటీపై వసూలు చేసే వడ్డీ ఇది. బిల్లు కట్టడంలో ఆలస్యమైనప్పుడు దీన్ని వసూలు చేస్తారు. బిల్లు కట్టడానికి వినియోగ దారులకు 15 రోజుల గడువు ఇస్తున్నారు. 15 రోజుల లోపు బిల్లు కట్టకపోతే వడ్డీతో చెల్లించాల్సి ఉంటుంది.

సర్‌ఛార్జీ : దీన్ని డిలే పేమెంట్ సర్‌ఛార్జీగా పరిగణిస్తారు. వినియోగదారుడి బిల్లు వచ్చిన 15 రోజుల్లో నగదు చెలిస్తే ఎలాంటి రుసుం వసూలు చేయరు. ఆలస్యంగా చెల్లిస్తే రూ. 100కు రోజుకు 5 పైసలు చొప్పున సర్‌ఛార్జీగా చెల్లించాల్సి ఉంటుంది.

షార్ట్ ఫాల్ : మీటర్ ఆగిపోయినా లేదా ముందు నెలలో బిల్లు సక్రమంగా వేయకపోయినా అందుకు సబంధించిన ఛార్జీలను షార్ట్‌ఫాల్‌గా వసూలు ▶ 2లో

బలమైన పాస్‌వర్డ్‌తో...

డిజిటల్ అకౌంట్లు భద్రం : ఎస్‌పి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

బ్యాంకు అకౌంట్, నెట్ బ్యాంకింగ్, ఫోన్‌పే/పేటీఎం, ఫేస్‌బుక్ లాంటి ఇతర సోషల్ మీడియా అకౌంట్లకు సంబంధించి పాస్‌వర్డ్‌ల విషయంలో ప్రజలు చాలా జాగ్రత్తగా ఉండాలని ఎస్‌పి మలికా గర్గ్ తెలిపారు. డిజిటల్ టెక్నాలజీ వేగంగా అభివద్ధి చెందుతున్న తరుణంలో చాలా వరకు వ్యక్తిగత సమా చారం డిజిటల్‌గానే భద్రపర్చుకోవడం ఇప్పుడు సర్వసాధారణమైందన్నారు. ఇ-మెయిల్స్‌తో పాటు బ్యాంకు ఖాతాలకు సంబంధించిన పూర్తి డేటాను దొంగిలించేందుకు హ్యాకర్లు కొత్త కొత్త టెక్నాలజీని వినియోగించి సులభంగా గుర్తిస్తున్నారన్నారు. దీంతో వ్యక్తిగత వివరాలతో పాటు ఖాతాలో ఉన్న డబ్బులు సైతం మాయమయ్యే అవకాశం ఉందన్నారు. సైబర్ నేరగాళ్లు పాస్‌వర్డ్ వీక్‌గా ఉన్న సోషల్ మీడియా అకౌంట్స్‌ను లక్ష్యంగా చేసి మొదటగా అకౌంట్ వివరాలను పరిశీలించి సేకరిస్తారన్నారు. ఆ వివరాలను వినియోగిస్తూ అకౌంట్స్‌కు సంబంధించిన పాస్ వర్డ్‌ను తమకు అనుకూలంగా మార్చుకుని అకౌంట్‌ను హ్యాక్ చేస్తారన్నారు. తర్వాత వారి అకౌంట్ కు డబ్బులు వెయ్యాలని చెబుతారని, ఆ మాటలు నమ్మి వాళ్ళ అకౌంటుకు డబ్బును వేసినా తిరిగి ఇచ్చే అవకాశం ఉండదన్నారు. ఎవరు గుర్తు పట్టని విధంగా పాస్‌వర్డులు పెట్టుకోవాలని జిల్లా ఎస్‌పి సూచించారు.

పాస్‌వర్డ్‌ల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- పాస్‌వర్డ్‌లో కనీసం 8 క్యారెక్టర్స్ ఉండేలా చూసుకోవాలి. అంతకంటే ఎన్ని ఎక్కువ ఉంటే పాస్‌వర్డ్ పటిష్టంగా ఉంటుంది.
- పాస్‌వర్డ్‌లో అప్పర్ కేస్ అక్షరాలు, లోయర్ కేస్ అక్షరాలు, అంకెలతో పాటు సింబల్స్ వినియోగించి స్ట్రాంగ్ పాస్‌వర్డ్ పెట్టుకోవాలి.
- సులభంగా ఊహించగల మీ పేరు, ఇంటి సభ్యుల పేర్లు, సెలబ్రేటీల పేర్లు, పిల్లల పేర్లు, గ్రామం పేరు, మొబైల్, బండి, డోర్, బర్త్ డే డేట్ వంటి సామాన్యంగా ఉండే వాటిని పెట్టుకోకూడదు.
- అన్ని అకౌంట్లకు ఒకే పాస్‌వర్డు పెట్టుకోవద్దు. అలా చేస్తే తీవ్ర నష్టాలకు గురిఅయ్యే ప్రమాదం ఉంటుంది.
- అకౌంట్ల యొక్క పాస్ వర్డ్‌ను ఎవరికి షేర్ చేయరాదు.
- వ్యక్తిగత వివరాలను అత్యంత గోప్యంగా ఉంచుకోవాలి.
- పాస్‌వర్డ్‌ను క్రమం తప్పకుండా మారుస్తూ ఉండాలి. తద్వారా మీ అకౌంట్లు సురక్షితంగా ఉంటాయి.
- ఇంటర్నెట్ కెఫెలో, ఇతరుల ల్యాబ్ ట్యాప్ / మొబైల్స్‌లో మీ ఆర్థిక/ఆర్థికేతర డిజిటల్ అకౌంట్లను ఓపెన్ చేస్తే పని పూర్తయ్యాక తప్పక సైన్ అవుట్ అవ్వాలి.
- ఎవరైన ఈ తరహా మోసానికి గురైతే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి లేదా సైబర్ హెల్ప్ లైన్ నెంబర్ 1930 కు కాల్ చేయాలని ఎస్‌పి తెలిపారు.

రాష్ట్ర అభివృద్ధికి రోడ్‌మ్యాప్ ఉందట

- బిజెపి అధ్యక్షుడు సోమువీర్రాజు ఉవాచ
- పథకాలన్నీ కేంద్రానివేనంటూ బుకాయింపు
- పొత్తులపై అడిగిన ప్రశ్నలకు అసహనం

ప్రజాశక్తి-ఒంగోలుబ్యూరో

ప్రత్యేక హోదా రాలేదు.విశాఖ స్టీల్ ప్రవేటీకరణ ఆగలేదు. వెనుక బడిన జిల్లాలకు ప్యాకేజీలు ఇవ్వలేదు. పెట్రోలు డీజిల్ ధరలు పెరుగుతూనే ఉన్నాయి. రైతులు కేంద్రంపై పోరాడు తున్నారు. ఇవన్నీ ఇలా ఉంటే రాష్ట్ర అభివృద్ధికి రోడ్ మ్యాప్ ఉందని బిజెపి అధ్యక్షుడు సోమువీర్రాజు ఘనంగా చెప్పారు. ఒంగోలులో ఆ పార్టీ నేతలు తలపెట్టిన మేధావుల సదస్సులో పాల్గొనేందుకు వచ్చిన ఆయన విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్రంలో మోడీ సభలు పెడుతున్నామన్నారు.ఎపికి రోడ్‌మ్యాప్ వేసింది బిజెపి నని తెలిపారు. రాబోయే రోజుల్లో సామాజిక ఆర్థిక అభివృద్ధి గురించి చెప్పే కార్యక్రమం చేపడుతున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో ఏం చేశామో చెప్పుకునే ఘన చరిత్రగలిగిన ఏకైక పార్టీ బిజెపి అని ఉద్ఘాటించారు. ఇందుకోసం యాత్రలు, సభలు చేపడుతున్నట్లు వెల్లడించారు.ఒక్కో అసెంబ్లీ పరిధిలో 60 వేల మంది మహిళలకు రూ.2లక్షలు అప్పు ఇచ్చి రూ30 వేలు సబ్సిడి ఇస్తున్నామన్నారు. అదే విధంగా 50వేల మంది రైతులకు రూ.6వేలు ఇస్తున్నట్లు చెప్పారు. ఉపాధిహామీ ద్వారా 50వేల కుటుంబాలకు పనులు కల్పిస్తున్నట్లు చెప్పారు. పసల్‌బీమా మొదలు అన్ని రకాల పథకాలూ కేంద్రాని వేనన్నారు.రాష్ట్రంలో 90 లక్షల మందికి బియ్యం ఇస్తుందెవరు అని ప్రశ్నించారు. మధ్యాహ్నం భోజన పథకంతో పాటు విద్య వైద్యంలో 16 రకాల కార్యక్రమాలు చేపట్టామన్నారు.165 రకాల పథకాలు కేంద్రాని వేనన్నారు. ఇవన్నీ ఎవరివని బుకాయించారు. ఆరులైన్ల రోడ్లు ఎవరైనా వేశారా?అని ప్రశ్నించారు. జనసేనతో పొత్తులపై ప్రశ్నించగా...ఆయన అసహనం వ్యక్తం చేశారు.అన్నీ మమ్మల్నే అడుగుతారా? వాళ్లను అడగరా? అని ఎదురు పశ్నించారు.ప్రజలతోనే తమ అలయెన్సు అని అన్నారు. ఇన్ని చేసిన మమ్మల్ని వాళ్లతో కలుస్తారా? వీళ్లతో కలుస్తారా?అని ప్రశ్నించడం ఏమిటని విలేకర్లపై అసహనం వ్యక్తం చేశారు. వారాహి వద్దకు వెళ్లి వాళ్లతో కలుస్తారా?అని ప్రశ్నించగలరా?అని అడిగారు. పొత్తులపై మరోసారి వీర్రాజు గందరగోళ పరిస్థితి కలిగేలా వ్యాఖ్యానించారనే చర్చసాగుతోంది. అన్ని పథకాలూ తమవేనంటూ చెప్పుకునేయత్నం చేశారు.

పేర్లే మార్పు.. అంతా బాదుడే..

(మొదటి పేజీ తరువాయి)

చేశారు. ఇది ప్రతి నెలా ఉండకపోవచ్చు. ఏదైనా కారణం ఉంటేనే ఈ షార్ట్ ఫాల్ ఛార్జీ వసూలు చేస్తారు.

ట్రూ అప్ ఛార్జీ: ఏప్రిల్ 2014 నుంచి మార్చి 2019 మధ్యవినియోగదారుడు వినియోగించుకున్న విద్యుత్ ట్రూఅప్ ఛార్జీ వసూలు చేస్తున్నారు. యూనిట్‌కు 7 పైసలు చొప్పున ఆగస్టు 2022 నుంచి జనవరి 2024 వరకూ 18 వాయిదాల్లో దీన్ని వసూలు చేయనున్నారు. ఆ ఐదేళ్లలో విద్యుత్ సరఫరా కోసం వాస్తవంగా అయిన ఖర్చు, వసూలు చేసిన ఛార్జీల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని నేరుగా వినియోగదారుల నుంచి వసూలు చేస్తున్నారు.

ఎఫ్‌పిపిసిఎ ఛార్జీలు: దీన్ని ఫ్యూయల్ పవర్ పర్చేస్ కాస్ట్ అడ్జస్ట్‌మెంట్‌గా చెబుతున్నారు. బొగ్గు లేదా ఇంధనం ధరల్లో పెరుగుదలను నేరుగా వినియోగదారుల నుంచి వసూలు చేసేందుకు తెచ్చిన ఛార్జీ ఇది. మూడు నెలలకు ఒకసారి యూనిట్లు, శ్లాబులకు అనుగుణంగా రేట్లు మారతాయి.

చీరాలకు చెందిన విజయలక్ష్మి అనే గృహిణికి జూన్ నెలలో రూ.2,180 బిల్లు వచ్చింది. దీనికి అదనంగా ఫిక్స్‌డ్ ఛార్జీగా రూ. 20, కస్టమర్ ఛార్జీగా రూ. 55, ఎలక్ట్రిసిటీ డ్యూటీ రూ. 21.48పైసలు, సర్‌ఛార్జీగా రూ.25, ట్రూఅప్ ఛార్జీ రూ.111.41 పైసలు ఎఫ్‌పిపిసిఎ ఛార్జీగా (05/2021) పేరుతో రూ.160.20 పైసలు, ఎఫ్‌పిపిసిఎ ఛార్జీ (04/2023) పేరుతో రూ.126.80 పైసలు కలిపి మొత్తం రూ.2,701 బిల్లు వచ్చింది. వాస్తంగా వినియోగించుకున్న విద్యుత్ కంటే వివిధ ఛార్జీల పేరుతో అదనంగా రూ.521 భారం పడింది.

స్మార్ట్ మీటర్ల బిగింపు ఆపాలి: సిపిఎం

ప్రజాశక్తి-వెలిగండ్ల: గృహాలకు స్మార్ట్ మీటర్ల బిగింపు నిర్ణయాన్ని ఉపసంహరించు కోవాలని సిపిఎం మండల నాయకులు రాయల మాలకొండయ్య డిమాండ్ చేశారు. సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో డిస్కంల కింద ఉన్న కరెంటు నేడు ప్రైవేటు పరం చేస్తున్నట్లు తెలిపారు. సౌత్ డిస్కం, సెంట్రల్ డిస్కం, ఆదాని ఎలక్ట్రానిక్ రకరకాల పేర్లతో విద్యుత్తు నడుస్తుందన్నారు. ఇప్పుడు స్మార్ట్ మీటర్లు బిగించి ట్రూ అప్ ఛార్జి, కస్టమర్ ఛార్జి, సేవా పన్నులు, ఫిక్స్‌డ్ ఛార్జీలు, ఎలక్ట్రిసిటీ డ్యూటీ పేరుతో అదనపు వసూలుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు.

దీంతో పేద, మధ్యతరగతి కుటుంబాలపై అదనపు భారం పడే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో స్మార్ట్ మీటర్ల బిగింపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. ఈ సమావేశంలో కండే బాలకష్ణ, పగడాల చక్రిరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆర్థిక సాయం అందజేత

సాయం అందిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-టంగుటూరు

నిరుపేద విద్యార్థుల ఉన్నత చదువులకు పమిడి కోటయ్య విజ్ఞాన కేంద్రం కమిటీ అండగా ఉంటుందని కామ్రేడ్ పమిడి కోటయ్య కుటుంబ సభ్యులు పమిడి రంగయ్య, మీనాకుమారి హామీ ఇచ్చారు. మండల పరిధిలోని పొందూరు గ్రామంలో పమిడి కోటయ్య-వెంకట శేషమ్మ విజ్ఞాన కేంద్రంలో విద్యార్థులకు ఆదివారం ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 10వ తరగతి పరీక్షలలో అత్యుత్తమ మార్కులు సాధించిన గడ్డం రాజేష్ ఉన్నత చదువుల నిమిత్తం రూ. 20 వేలు, గత ఏడాది 10వ తరగతి పరీక్షల ఫలితాలలో టాపర్‌గా నిలిచిన ఖైదుపల్లి చరణ్ ఇంటర్మీడియట్ విద్య కోసం మరో రూ.10 వేల నగదును మీనా కుమారి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా పమిటి కోటయ్య విజ్ఞాన కేంద్రం నిర్వహణ కమిటీ అధ్యక్షుడు, యుటిఎఫ్ మండల అధ్యక్షుడు కాట్రగడ్డ రమేష్ బాబు మాట్లాడుతూ పమిడి కోటయ్య విజ్ఞాన కేంద్రం తరపున ప్రజలకు ఉపయోగపడే మరిన్ని కార్యక్రమాలను భవిష్యత్తులో చేపడతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పమిడి కోటయ్య సోదరుడు పమిడి రంగయ్య, కుమార్తె మీనాకుమారి, పొందూరు ఎంపిటిసి పమిడి నాగేశ్వరరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రామీణ వైద్యులకు కిట్‌లు అందజేస్తున్న జెవివి జిల్లా గౌరవాధ్యక్షులు డాక్టర్ బి జవహార్

సెక్షమ్ సేవలు అభినందనీయం: డాక్టర్ జవహార్

ప్రజాశక్తి-చీమకుర్తి: సెక్షమ్ సంస్థ జాతీయ స్థాయిలో వికలాంగులకు సేవలు అందించడం అభినందనీయమని జెవివి జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ జవహార్ పేర్కొన్నారు. సెక్షమ్ ఆధ్వర్యంలో స్థానిక ఎస్‌కెఆర్ బధిరుల పాఠశాలలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జవహార్ మాట్లాడుతూ మేనరికం వివాహాల వల్ల వికలాంగ చిన్నారులు పుడుతున్నారని, వారి సంఖ్యను తగ్గించడానికి సెక్షమ్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. సెక్షమ్ రాష్ట్ర సభ్యులు చెర్నా రామాంజనేయులు మాట్లాడుతూ సక్షమ్ అనగా సమదృష్టి, క్షమతా వికాసం మరియు అనుసంధాన మండలని పేర్కొన్నారు. కలిగిరి రెడ్‌క్రాస్ సబ్‌బ్రాంచి ఛైర్మన్ వేణుగోపాల్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవాభావం అలవరుచుకోవాలన్నారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అదేవిధంగా వికలాంగులకు సేవలు అందించిన శ్రీనివాసులు, సుబ్బారావును సత్కరించారు. గ్రామీణ వైద్యులకు డాక్టర్ జవహార్ చేతుల మీదుగా మెడికల్ కిట్లను అందజేశారమీ కార్యక్రమంలో సెక్షమ్ జిల్లా కార్యదర్శి సంధాని, రవికుమార్, పాఠశాల కరస్పాండెంట్ అంజిరెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధిలో ప్రత్యేక గుర్తింపు తెస్తా: ఎమ్మెల్యే

ప్రజాశక్తి-చీరాల

రాష్ట్రంలోనే నియోజకవర్గ అభివృద్ధిలో చీరాలకు ప్రత్యేక గుర్తింపు తీసుకురావటమే లక్ష్యంగా పారిశుద్ధ్యం, డ్రైనేజీ, రోడ్ల నిర్మాణం పలు అంశాల సమస్యలపై ఎప్పటికప్పుడు అధికారులతో చర్చిస్తూ వాటిని పరిష్కరిస్తూ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళుతున్నామని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి అన్నారు. వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ కరణం వెంకటేష్‌బాబు ఆధ్వర్యంలో స్థానిక ఐఎంఎ హాలులో ఏర్పాటు చేసిన చీరాల నియోజకవర్గ విలేకరులతో ఆయన ఆత్మీయ సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న పలు ప్రధాన సమస్యలను గురించి జర్నలిస్టులను అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే అధికార యంత్రాంతో కలిసి పరిశీలించి వాటిని పరిష్కరిస్తానని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు గవర్నర్ కొణిజేటి రోశయ్య చీరాల ప్రాంత ప్రజలకు ఎంతో సుపరిచితుడు కావడంతో ఆయన జ్ఞాపకార్థంగా ఎంజిసి క్లాత్ మార్కెట్ సమీపంలో రోశయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేశామని,త్వరలోనే దానిని ప్రారంభిస్తామని అన్నారు. అదేవిధంగా దొండపాడు రోడ్డులోని డ్రైనేజీ పనులను ఏ పార్టీకే మున్సిపల్ అధికారులు ప్రారంభించారని, ఆ ప్రాంతంలో మురుగునీరు పారుదల జరిగే విధంగా శాశ్వత పరిష్కారం కోసం అధికారులతో చర్యలు చేపడతామని అన్నారు.

అభివద్ధి, సంక్షేమమే జగనన్న ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి-బల్లికురవ రూరల్

గ్రామాల సమగ్ర అభివద్దే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ప్రజలకు అభివద్ధి, సంక్షేమమే రెండు కళ్లుగా భావించి మారుమూల గ్రామాలలో సైతం ప్రజలకు సకల సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని శాప్ నెట్ ఛైర్మన్, వైసిపి అద్దంకి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బాచిన కృష్ణ చైతన్య అన్నారు. ఆదివారం మండల పరిధిలోని కొప్పరపాలెం, కే రాజుపాలెం గ్రామాలలో పలు ప్రారంభోత్సవాలు, అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు. కొప్పెరపాలెం గ్రామంలో రూ.40 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం కే రాజుపాలెం గ్రామంలో ఎన్ఎస్పి కెనాల్ నుంచి మంచినీటి చెరువుకు రూ.40 లక్షల రూపాయలతో నూతనంగా ఏర్పాటు చేసిన పైపులైను, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ప్రారంభోత్సవం చేశారు. రూ.10 లక్షల సాధారణ నిధులతో బిసి కమ్యూనిటీ భవనానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా చైతన్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి దేశంలో ఎక్కడా లేనివిధంగా గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు,

ప్రారంభోత్సవంలో పాల్గొన్న బాచిన కృష్ణచైతన్య

వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేసి ప్రజలకు సకల సౌకర్యాలు కల్పిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బాచిన చెంచు గరటయ్య, సంతమాగులూరు మార్కెట్ యార్డు వైస్ ఛైర్మన్ చింతల పేరయ్య,ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మి, గ్రామ సర్పంచి వల్లంరెడ్డి అమల, ధూళిపాళ్ల బుల్లి రామయ్య, మల్లయపాలెం సర్పంచ్ పల్లి రాఘవరావు, గుంటుపల్లి సర్పంచ్ మాదాల కృష్ణకుమారి శివన్నారాయణ, ఏఈ హనుమంతరావు, మండల కో ఆప్షన్ సభ్యులు షేకు శ్రీనువలి, ప్రచార కమిటీ అధ్యక్షుడు టి నరేష్, జి సీతారెడ్డి, సుబ్బారావు, ఎర్రకుల వెంకటేశ్వర్లు, జి వెంకటరామిరెడ్డి పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, గ్రామ వాలంటీర్లు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

మట్టితో పూడ్చిన కాలువ

కాలువలో మట్టిని తొలగించాలి

ప్రజాశక్తి-పామూరు

ప్రభుత్వ ఆస్తులు కనిపిస్తే చాలు రాత్రికి రాత్రే ఆక్రమణకు గురవుతున్నాయి. పామూరు పాత చెరువు ఆయకట్ట క్రింద ఉన్న వ్యవసాయ భూమిలో రాత్రికిరాత్రే మట్టిని తరలించారు. గతంలో చెరువు నిండి అలుగు తూములు వద్ద చెరువు కట్ట తెగుతున్న విషయం తెలిసిందే. చెరువు అలుగునీరు పారుదల అయ్యే కాలువలో రాత్రికి రాత్రే రియల్‌ఎస్టేట్ వ్యాపారులు మట్టి తొలి వంకను పూడ్చారు. మట్టి పోయడం వల్ల అలుగు నీరు పోయే మార్గం లేక భవిష్యత్‌లో గోపాలపురం గ్రామానికి ముంపు ఏర్పడే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలువలో తోటిని మట్టిని తొలగించాలని గోపాలపురం గ్రామస్తులు కోరుతున్నారు.

గ్రామపంచాయతీ కార్యాలయము - పంగులూరు గ్రామం

జె.పంగులూరు మండలం - బాపట్ల జిల్లా.

Roc No: 05/ 2023. తేదీ: 26/06/2023

బాపట్ల జిల్లా, జె. పంగులూరు మండలం. పంగులూరు గ్రామ పంచాయతీలో తేదీ: 01/07/2023 సంవత్సరం నుండి తేదీ: 30/06/2024 వరకు ఒక సంవత్సర కాలానికి పని చేయుటకు గాను ఈ దిగువ తెలిపిన సిబ్బంది పనిచేయుటకు సీలు వేసిన టెండర్లును తేదీ: 28/06/2023 మధ్యాహ్నం 3-00 గంటల వరకు ఈ దిగువ సంతకం దారు వద్ద గాని, లేక వారి అనుమతి పొందిన వారిచే గాని గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద స్వీకరించబడును. సదరు సీలు వేసిన టెండర్లను అదే రోజు అదే ప్రదేశంలో మధ్యాహ్నం 3:30 గంటలకు హాజరై టెండర్ దారుల సమక్షంలో టెండర్లు తెరవబడును .ఆసక్తి గలవారు ఆయా ఐటంకు ఎదురుగా చూపబడిన ధరావత్తు చెల్లించి టెండర్‌లో పాల్గొనవచ్చును. ధరావత్తు 100 రూపాయలు. ధరావతు చెల్లించని మరియు సకాలంలో రానీ టెండర్లు స్వీకరించబడవు. ఏ కారణం చూపకుండానే టెండర్లు వాయిదా వేయుటకు లేదా రద్దు చేయుటకు పంచాయతీ కార్యదర్శికి అధికారం కలదు. మిగిలిన విషయాలు ఆఫీసు పని చేయు వేళలో అడిగి తెలుసుకొనవచ్చును.

వ.నెం.	సరఫరా వివరములు	చెల్లించవలసిన ధరావత్తు మొత్తం
1.	తేదీ: 01-07-2023వ సంవత్సరం నుండి తేదీ: 30-06-2024 వరకు టర్న్ కాక్ నీటి సరఫరా చేయుటకు రోజువారీ కూలిపై పనిచేయుటకు (ముగ్గురు).	100 రూ॥లు
2.	తేదీ: 01-07-2023వ సంవత్సరం నుండి తేదీ: 30-06-2024 వరకు స్వీపర్ గా రోజువారీ కూలిపై పనిచేయుటకు (ఇద్దరు).	100 రూ॥లు

గమనిక:- 1. పంచాయితీ నిధులు సమృద్ధిగా ఉన్నప్పుడు మాత్రమే చెల్లింపులు చేయబడును.
2. టెండర్లకు సంబంధించిన ఏ విషయములైనను ఏ న్యాయస్థానంలో ఫిర్యాదు చేయరాదు.
3. పంచాయితీ కార్యదర్శులు గారిచే ఎప్పటికప్పుడు జారీ చేయబడు ఆదేశాలను టెండరుదారు తప్పక పాటించవలెను.

సం// లాం సునీత
పంచాయితీ కార్యదర్శి,
పంగులూరు గ్రామపంచాయతీ,
బాపట్ల జిల్లా.

గ్రామ పంచాయతీ కార్యాలయం - కొమరోలు

కొమరోలు మండలం, ప్రకాశం జిల్లా

టెండరు ప్రకటన

ఆర్.ఓ.సి.నెం.08/2023 తేది:26.06.2023

ప్రకాశం జిల్లా, కొమరోలు మండలం, కొమరోలు గ్రామ పంచాయితీ 2023-2024 సంవత్సరమునకు తేది: 01-07-2023 నుండి 30-06-2024 వరకు కాంట్రాక్టు పద్ధతిపై పనులు నిర్వహించుటకు గాను సీల్డు టెండర్లు కోరబడుచున్నవి. కొమరోలు గ్రామపంచాయితీ కార్యదర్శి గాని, వారి అనుమతి పొందిన వారిచే గాని సీల్డు టెండర్లు తేది:30-06-2023 ఉదయం 10 గంటల నుండి ఈ కార్యాలయము నందు స్వీకరించబడి అదే రోజు మధ్యాహ్నం 3:00 గం.లకు హాజరు అయిన టెండరుదార్ల సమక్షంలో టెండర్లు తెరువబడును. టెండరు షెడ్యూల్లో వివరముల ప్రకారం షరతులు, నిబంధనలకు లోబడి ధరావత్తు చెల్లించిన రసీదును టెండరు షెడ్యూలుకు జతపరచవలెను. ఏ కారణం చూపకనే టెండర్లు వాయిదా వేయుటకు, రద్దు పరుచుటకు గ్రామ పంచాయితీ వారికి పూర్తి అధికారములు కలవు.

వ.నెం	వివరములు	వర్తించు కాలం	సంఖ్య	ధరావత్తు
1.	రక్షిత మంచినీటి సరఫరా	01.07.2023 నుండి 30.06.2024 వరకు	2	రూ.100/-
2.	స్వీపర్ కమ్ డ్రైవర్	01.07.2023 నుండి 30.06.2024 వరకు	2	రూ.100/-
3.	ఎలక్ట్రీషియన్	01.07.2023 నుండి 30.06.2024 వరకు	1	రూ.100/-
4.	రికార్డు అసిస్టెంట్	01.07.2023 నుండి 30.06.2024 వరకు	1	రూ.100/-
5.	ఆటో డ్రైవర్	01.07.2023 నుండి 30.06.2024 వరకు	1	రూ.100/-

షరతులు: 1. కాంట్రాక్టు 1 సంవత్సరకాలం అనగా 01-07-2023 నుండి 30-06-2024 వరకు మాత్రమే అమలులో ఉండును.
2. గ్రామపంచాయితీ నిధుల సౌలభ్యతను బట్టి మాత్రమే వేతనములు చెల్లించబడును.
3. పని సంతృప్తికరముగా లేని యెడల సదరు కాంట్రాక్టును రద్దు చేయు అధికారం గ్రామపంచాయితీ వారికి కలదు.

సం/- శ్రీ కావాడి సురేష్ కుమార్,
పంచాయితీ కార్యదర్శి,
గ్రామపంచాయితీ,
కొమరోలు, ప్రకాశంజిల్లా.

నేర ప్రవృత్తిని మార్చుకోవాలి: ఎస్‌పి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

మాజీ నేరస్తులు నేర ప్రవృత్తిని విడనాడి సత్ప్రవర్తన వైపు వారి జీవితాలను మార్చుకోవాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. జిల్లా ఎస్పీ ఉత్తర్వుల మేరకు ఆదివారం జిల్లా వ్యాప్తంగా ఉన్న రౌడీ షీటర్లకు ఆయా పరిధిలో ఉన్న స్టేషన్ ఆఫీసర్లు కౌన్సెలింగ్ ఇచ్చి, ప్రస్తుత చట్టాల గురించి నేరం చేసిన వారు తిరిగి నేరం చేస్తే జరిగే పరిణామాల గురించి వారికి వివరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో శాంతిభద్రతల ముందస్తు పరిరక్షణలో భాగంగా జిల్లా వ్యాప్తంగా రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కౌన్సెలింగ్‌లో గతంలో నేరాలు చేసి ప్రస్తుతం రౌడీ షీటర్‌గా ఉన్న వారి రోజువారీ జీవితం ఎలా గడుపుతున్నారు, గొడవలకు, నేరాలకు, అల్లర్లు సృష్టించుటకు దూరంగా ఉన్నారా? లేదా? ఇలాంటి విషయాలు తెలుసుకోవడం, రౌడీ షీటర్‌గా ఉండి ప్రస్తుతం సమాజంలో మంచి నడవడికతో జీవిస్తూ ఉండి భవిష్యత్తులో వారు ఎటువంటి నేరాలకి పాల్పడకుండా ఉండేటట్లు ప్రస్తుత చట్టాలు ఎంత కఠినంగా ఉన్నాయో వివరిస్తూ కౌన్సెలింగ్

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న బాపట్ల జిల్లా పోలీసు అధికారులు

నిర్వహించినట్లు తెలిపారు. ఈ కౌన్సెలింగ్ యొక్క ముఖ్య ఉద్దేశం.. గతంలో అవగాహన లేక క్షణికావేశంలో నేరాలకు పాల్పడి, శిక్షలకు గురై వారి అమూల్యమైన జీవితాలను పాడు చేసుకున్న అనేకమంది తిరిగి నేరం చేయకుండా ఉండేందుకు, సమాజంలో మంచి పౌరుల వలే నడుచుకునేందుకు వారి జీవితాలను సరిదిద్దుకునే లాగా, వారి నేర ప్రవృత్తిని, నేరం చేయాలనే ఆలోచన సరళిని మార్చుకునే విధంగా కౌన్సెలింగ్ నిర్వహించినట్లు తెలిపారు.

మాజీ నేరస్తులపై నిఘా

మాజీ నేరస్థుల మీద పోలీస్ శాఖ ఎప్పుడూ దృష్టి ఉంచుతుందని, వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తూనే ఉంటుందని, ఎట్టి పరిస్థితుల్లోనూ మాజీ నేరస్తులు తిరిగి నేరం చేస్తే కఠినమైన శిక్షలు అనుభవించాల్సి వస్తుందని ఎస్‌పి హెచ్చరించారు. వారి మిగిలిన జీవితం కూడా జైలులోనే గడపవలసి వస్తుందని అన్నారు. ముఖ్యంగా రౌడీ షీటర్‌లు గంజాయి, నాటుసారా, జూదం లాంటి చట్ట వ్యతిరేక కార్యక్రమాల్లో పాల్గొనరాదని తెలిపారు. జిల్లాలో శాంతి భద్రతను అదుపులో ఉంచి జిల్లా ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే తమ ఉద్దేశమని, ఈ విషయంలో ఎవరైనా వ్యతిరేకంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకోవడానికి వెనుకాడబోమని హెచ్చరించారు. అదేవిధంగా నేర ప్రవృత్తిని మార్చుకొని సమాజంలో మంచిగా జీవించే వారికి పోలీస్ శాఖ ఎల్లవేళలా తోడ్పాటు ఇస్తుందని తెలిపారు.

మోటారు చోరీ

ప్రజాశక్తి-దర్శి

మండలంలోని వెంకటాచలంపల్లి వద్ద జగనన్న కాలనీలో 150 నెంబరు ప్లాటు వద్ద గుర్తు తెలియని వ్యక్తులు బోరులోని మోటారును బయటకు తీసి దొంగిలించారు. దాని విలువ సుమారు రూ.20 వేలు పైన ఉంటుంది. జగనన్న కాలనీలో సుమారుగా 10 నుంచి 12 బోర్లు వేసి బిగించి ఉన్నారు. దొంగతనం జరుగకుండా తగు చర్యలు చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.

సూపర్‌స్టార్ అవార్డును అందుకుంటున్న సందిరెడ్డి శ్రీనివాసరావు

సందిరెడ్డికి సూపర్‌స్టార్ అవార్డు

ప్రజాశక్తి అద్దంకి

గుంటూరులో జరిగిన రోటరీ డిస్ట్రిక్ట్ 3150 క్లబ్ వార్షిక సమావేశంలో రోటరీ క్లబ్ ఆఫ్ సింగరకొండ అద్దంకి 113 క్లబ్స్‌లో సూపర్‌స్టార్ క్లబ్ అవార్డును, ప్రెసిడెంట్ సందిరెడ్డి శ్రీనివాసరావు కి డిస్ట్రిక్ట్ గవర్నర్ తాళ్ల రాజశేఖరరెడ్డి అందజేశారు. ఆంధ్ర రీజియన్‌లో ఉత్తమ ద్వితీయ ప్రెసిడెంట్ అవార్డు కూడా సందిరెడ్డి శ్రీనివాస్ రావు అందుకున్నారు. ఇంకా వివిధ భాగాలలో 17 అత్యుత్తమ సేవా సర్టిఫికెట్స్ కూడా అందుకున్నారు. సందిరెడ్డి శ్రీనివాసరావుతో పాటు ఈ సభలో 35 మంది సభ్యులు అద్దంకి నుంచి హాజరయ్యారు. ఉత్తమ అవార్డులు పొందిన సందిరెడ్డి శ్రీనివాసరావును పలు క్లబ్స్ వారు అభినందించారు.

చోరీ కేసులో సీఆర్పీఎఫ్ కానిస్టేబుల్ అరెస్టు

రూ.2 లక్షల సొత్తు స్వాధీనం

ప్రజాశక్తి-త్రిపురాంతకం

త్రిపురాంతకం మండల కేంద్రం లోని అంబికా జ్యువెలరీ షాపులో ఈ నెల 3వ తేదీన ఓ వ్యక్తి వచ్చి నేను సీఆర్పీఎఫ్ ఉద్యోగిని. హారాలు చూపాలని అడిగి హారాలను పరిశీలిస్తున్నట్లు నటించి వాటితో పరారైన విషయం తెలిసిందే. అయితే ఈ చోరీ కేసును దర్శి డీఎస్పీ అశోక్ వర్ధన్ పర్యవేక్షణలో త్రిపురాంతకం సీఐ పాపారావు, ఎస్ఐ, పోలీస్ సిబ్బంది చాకచక్యంతో ఛేదించారు. చోరీకి పాల్పడిన వ్యక్తి వద్ద నుంచి నగలను రికవరీ చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. ప్రకాశం జిల్లాలోని పుల్లలచెరువు మండలం రెంటపల్లి తండాకు చెందిన బాణావత్ సోమ్లా నాయక్ అనే వ్యక్తి సుమారు ఏడు సంవత్సరాల నుంచి సీఆర్పీఎఫ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ప్రస్తుతం సెలవుల్లో స్వగ్రామం వచ్చి ఉంటున్నాడు. బెట్టింగ్, చెడు వ్యసనాలకు లోనై కుటుంబ పోషణకు, జల్సాలకు డబ్బులు లేక ఇబ్బంది పడుతూ ఏదైనా దొంగతనం చేసి సులభంగా డబ్బులు సంపాదించాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో మండల కేంద్రమైన త్రిపురాంతకంలో జ్యువెలరీ షాపులో షాపు యజమానులైన భార్యాభర్తలు మాత్రమే ఉండడం గమనించి తనకు నగలు కావాలని తరువాత మళ్లీ వస్తానంటూ వెళ్లిపోయాడు. కాసేపటి తరువాత ముఖానికి మాస్క్ వేసుకుని వచ్చి షాపు యజమాని నగలు చూపిస్తున్న క్రమంలో పరిశీలిస్తున్నట్లు నటించి నగలతో బయటకు పరుగు తీసి అప్పటికే సిద్ధం చేసుకున్న ద్విచక్ర వాహనంపై నగలతో పరారయ్యాడు. దొంగిలించిన బంగారు హారాలను అమ్ముకునేందుకు గుంటూరు వెళుతున్న క్రమంలో నిందితుడిని త్రిపురాంతకం మండలంలోని మేడపి బస్టాండ్‌లో పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి నుంచి రూ.2 లక్షల విలువైన 79 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో త్రిపురాంతకం సిఐ పాపారావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ట్యాంకర్‌ను ఢీకొట్టిన టిప్పర్

హైవేపై ఆగి ఉన్న ట్యాంకర్‌ను ఢీకొన్న టిప్పర్

డ్రైవర్, క్లీనర్‌కు గాయాలు

ప్రజాశక్తి-శింగరాయకొండ: శింగరాయకొండ జాతీయ రహదారి పరిధిలోని కలికివాయి ఫ్లైఓవర్ బ్రిడ్జి మీద ఆదివారం మరమ్మతుల కారణంగా ఆగిపోయి ఉన్న ట్యాంకర్‌ను వెనుక నుంచి వచ్చిన టిప్పర్ ఢీకొంది. కావలి వైపు నుంచి ఒంగోలు వైపు వెళ్తున్న ఈ టిప్పర్ ఫ్లై ఓవర్ బ్రిడ్జి మీద ట్యాంకర్‌కు మరమ్మతులు చేయిస్తున్న విషయాన్ని గమనించలేదు. అక్కడ ప్రమాద హెచ్చరిక బోర్డులు కూడా హైవే అధికారులు ఏర్పాటు చేశారు. దానిని ఏమీ గమనించని టిప్పర్ డ్రైవర్ వేగంగా వచ్చి హెచ్చరిక బోర్డులను సైతం ఢీకొట్టి ఆగి ఉన్న ట్యాంకర్‌ను ఢీకొట్టింది. డ్రైవర్ ప్రేమ్, క్లీనర్ మహమ్మద్ హఫీజ్‌లకు గాయాలయ్యాయి. వారిని ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. డ్రైవర్ నిద్రమత్తు కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని చెబుతున్నారు. ఘటన స్థలాన్ని ఎస్ఐ టి శ్రీరామ్ పరిశీలించారు. వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జాతీయ రహదారి పోలీసులు, అధికారులకు సూచనలు ఇచ్చారు.

మాట్లాడుతున్న ఆర్‌డిఓ సరోజిని

జాబ్ మేళాలతో యువతకు ఉద్యోగావకాశాలు: ఆర్‌డిఓ

ప్రజాశక్తి-చీరాల

జాబ్ మేళాలతో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించటం శుభ పరిణామమని, నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలని ఆర్డిఓ సరోజిని అన్నారు. శ్రీ గౌతమి డిగ్రీ కళాశాల మరియు ఎన్ఎస్‌సీ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం కొత్తపేట రోడ్డులోని కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన మెగా జాబ్‌మేళా కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా చీరాల చుట్టుపక్కల ప్రాంతాల నుంచి అభ్యర్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. వెయ్యికి పైగా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూ 27 కంపెనీలు ఈ జాబ్ మేళా కార్యక్రమంలో పాల్గొన్నాయి. ఈ మేళా కార్యక్రమానికి ఆర్డీవో సరోజని ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీ గౌతమి కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఎం వెంకటేశ్వర్లు అభ్యర్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులలో విద్యావంతులు ఎక్కువగా ఉండటం, వారికి తగినన్ని ఉద్యోగాలు లేకపోవడమే నిరుద్యోగ సమస్యకు కారణమని అన్నారు. అయితే ఇటువంటి జాబ్ మేళా కార్యక్రమాలు గ్రామీణ, చిన్నతరహా పట్టణ ప్రాంతాల్లో ఉన్న నిరుద్యోగులకు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. ఉద్యోగం చిన్నది, పెద్దది అని చూడకుండా అవకాశం వచ్చిన దాన్ని అందిపుచ్చుకోవాలని అన్నారు. భవిష్యత్‌లో కూడా గౌతమి కళాశాల ఆధ్వర్యంలో ఇటువంటి మంచి కార్యక్రమాలు చేపట్టేలా యాజమాన్యం కూడా ముందుడుగు వేయాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌సీ డైరెక్టర్ శ్రీనివాసరావు, కళాశాల డైరెక్టర్లు, వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

సైబర్ క్రైమ్ లఘు చిత్రానికి క్లాప్ కొడుతున్న డిఎస్‌పి

రౌడీ షీటర్లు అల్లర్లకు పాల్పడితే జైలుకే: డిఎస్‌పి

ప్రజాశక్తి-బాపట్ల

వివాదాల్లో తలదూర్చి అల్లర్లకు పాల్పడితే జైలుకు పంపుతామని బాపట్ల డిఎస్పి వెంకటేశులు హెచ్చరించారు. ఆదివారం బాపట్ల పోలీసు సబ్ డివిజన్ బాపట్ల సర్కిల్ పరిధిలో రౌడీ షీటర్లకు బాపట్ల డిఎస్పి వెంకటేశులు కౌన్సెలింగ్ ఇచ్చారు. రౌడీషీట్ రికార్డుల్లో ఉన్న వ్యక్తులు ఎవరినైనా బెదిరించి శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రశాంతమైన వాతావరణంలో కుటుంబ సభ్యులతో జీవించాలన్నారు. కాదని ప్రజలను ఇబ్బంది పెట్టినా, దాడులకు పాల్పడినా జైలుకేనన్నారు. వారి నివాస పరిసర ప్రాంతాల్లో ఏదైనా వివాదాలు జరిగితే తక్షణమే పోలీసులకు తెలియజేయాలన్నారు. రౌడీ షీటర్లు మంచి నడవడికతో ఏ విధమైన వివాదాలు లేకుండా ప్రశాంతమైన వాతావరణంలో జీవిస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి వారి ఆదేశాల మేరకు రౌడీషీట్లు తొలగించేందుకు ప్రయత్నాలు చేస్తామని చెప్పారు. అనంతరం బాపట్ల పోలీసు శాఖ సౌజన్యంతో విఆర్ క్రియేషన్స్ సమర్పణలో సైబర్ క్రైమ్ షార్ట్ ఫిలింను క్లాప్‌కొట్టి డిఎస్‌పి వెంకటేశులు ప్రారంభించారు. సైబర్ నేరాల పట్ల ఈ తరహా లఘు చిత్రాలు ఎంతగానో దోహదపడతాయని ఈ సందర్భంగా డిఎస్పి పేర్కొన్నారు. సైబర్ క్రైమ్ లఘుచిత్రం పోస్టర్‌ను పట్టణ సిఐ కృష్ణయ్య ఆవిష్కరించారు. కార్యక్రమంలో బాపట్ల రూరల్ సీఐ జి వేణుగోపాల్ రెడ్డి, పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ సుధాకర్, బాపట్ల రూరల్, వెదుళ్ళపల్లి, కర్లపాలెం, చందోలు ఎస్ఐలు వెంకటప్రసాద్, నాగ శ్రీను, శివయ్య, రాజశేఖర్, లఘు చిత్రం డైరెక్టర్ టి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పీహెచ్‌సికి కుర్చీలు బహూకరిస్తున్న రోటరీ అధ్యక్షులు డాక్టర్ ఐ బాబురావు

పిహెచ్‌సికి కుర్చీలు బహూకరణ

ప్రజాశక్తి-చీరాల: సేవా కార్యక్రమాలలో రోటరీ బండి వెళ్దాం ముందుంటుందని అందులో భాగంగా మండలంలోని ఈపురిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి కుర్చీలను బహుకరిస్తున్నట్లు రోటరీ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ ఐ బాబురావు అన్నారు. పిహెచ్‌సికి వచ్చే మహిళలకు ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహార నియమాలు, వ్యాయామం తదితర పలు అంశాలపై అవగాహన కల్పించారు. సమయపాలన పాటిస్తూ మందులను తీసుకోవాలని సూచించారు. గర్భిణులు పౌష్టికాహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలని అన్నారు. పసిబిడ్డ ఎదుగుదలకు తల్లి ఆరోగ్యానికి పౌష్టికాహారం ఎంతో కీలకమని, కావున తప్పనిసరిగా మంచి ఆహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రతినిధి పోలుదాసు రామకృష్ణ, కష్ణమూర్తి డాక్టర్ శ్రీదేవి, పిహెచ్‌సి సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల మత్తులో యువత

ఏటా బానిసలవుతున్న 30 కోట్లమంది ● 3 కోట్ల మంది మృత్యుఒడికి ● నేడు ప్రపంచ మాదకద్రవ్యాల వ్యతిరేక దినం

ప్రజాశక్తి-బాపట్ల

మాదకద్రవ్యాల మత్తులో యువత చిత్తవుతోంది. బంగారం లాంటి భవిష్యత్తున్న యువత బతుకులు నేల రాలుతున్నాయి. మాదక ద్రవ్యాలకు బానిసలైన అనేకమంది మృత్యుఒడికి చేరుతున్నారు. ఈ నెల 26న అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వాడకం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ప్రజాశక్తి అందిస్తున్న ప్రత్యేక వార్తా కథనం.. ప్రపంచ వ్యాప్తంగా మాదక ద్రవ్యాల ద్వారా రూ.50 వేల కోట్ల డాలర్ల మాదక ద్రవ్యాల వ్యాపారం జరుగుతోంది.

పెట్రోలియం, ఆయుధాల వ్యాపారం తర్వాత ప్రపంచంలో మాదక ద్రవ్యాలదే మూడో అతి పెద్ద వ్యాపారం. కోట్లాది మంది ప్రజలు మాదక ద్రవ్యాలకు బానిసలై మృత్యుబారిన పడుతున్నారు. ప్రపంచంలో దాదాపు 28 కోట్ల మంది మాదక ద్రవ్యాలు వాడుతున్నారు. ప్రతి ఏటా మూడు కోట్ల మంది మృత్యుబారిన పడుతున్నారు. గత ఏడాది వీటికి బానిసలై రెండు లక్షల మంది మరణించారు. నిత్యం ఒక కోటీ 20 లక్షల మంది మత్తుమందు ఇంజెక్షన్లు చేయించుకుంటున్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఏటా 340 టన్నుల హెరాయిన్ వినియోగిస్తున్నారు. పొగాకు ఉత్పత్తుల వాడకం వల్ల ప్రపంచవ్యాప్తంగా 25 కోట్ల మంది పిల్లలకు ప్రాణహాని ఉన్నట్లు లెక్క తేల్చారు. దేశంలో మాదక ద్రవ్యాలకు రెండు కోట్ల మంది బానిసలుగా ఉన్నారు. పది లక్షల మంది హెరాయిన్ బాధితులుగా ఉన్నారు. దేశంలో ప్రతి రోజూ 55 వేల మంది పిల్లలు మాదక ద్రవ్యాలకు అలవాటు పడుతున్నారు. యువత, పిల్లలు గంజాయి, బ్రౌన్ షుగర్ వంటి పలు మాదక ద్రవ్యాలు నిత్యం వాడుతున్నారు. వీటికి బానిసలై తమ జీవితాలను చేజేతులా నాశనం చేసుకుంటున్నారని దేశ మాదక ద్రవ్యాల నియంత్రణ మండలి గణాంకాలు చెబుతున్నాయి. మాదక ద్రవ్యాల బారి నుంచి పిల్లలను, యువతను కాపాడాల్సిన బాధ్యత సమాజం మొత్తం మీద ఉంది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ బాపట్ల జిల్లాలో గంజాయి అక్రమ రవాణాను పూర్తిస్థాయిలో అరికడుతున్నామని తెలిపారు. ఇప్పటికే నలుగురి మీద పీడీ యాక్ట్ చట్టం అమలు చేశామని వెల్లడించారు. జిల్లా సెబ్ అధికారి నరసింహారావు మాట్లాడుతూ బాపట్ల జిల్లాలో మాదక ద్రవ్యాలను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఫోరం ఫర్ బెటర్ ఆధ్వర్యంలో ప్రపంచ మాదక ద్రవ్యాల నిరోధక వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఫోరం కార్యదర్శి సాయిబాబు తెలిపారు.

మాట్లాడుతున్న యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు పాపారావు

పుస్తకాలు సరఫరా చేయకుండా టీచర్లపై నిందలా?

ప్రజాశక్తి-బాపట్ల

అన్ని ప్రభుత్వ పాఠశాలలకు పూర్తి స్థాయిలో పుస్తకాలు జెవికె కిట్లు సరఫరా చేయకుండా విద్యార్థులకు పంపిణీ చేయలేదని రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ అధికారులు ఉపాధ్యాయులను నిందించడాన్ని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం బాపట్ల జిల్లా శాఖ గౌరవాధ్యక్షులు పాపారావు ఖండించారు. ఆదివారం బాపట్ల జిల్లా యూటీఎఫ్ కార్యాలయంలో జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. అధిక శాతం పాఠశాలల్లో ఇప్పటికీ పాఠ్య పుస్తకాలు, జెవికె కిట్లు సరఫరా చేయలేదని అన్నారు. దీనికితోడు ప్రభుత్వం అందజేసిన ట్యాబులు పనిచేయకపోవడం పట్ల ఉపాధ్యాయులను నిందించడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. పాఠశాలల్లో విద్యార్థుల అడ్మిషన్ల సమయంలో 679 ప్రధానోపాధ్యాయుల పోస్టులు ఖాళీగా ఉంచడం ఏమిటని ప్రశ్నించారు. సమావేశంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు బిక్షాలు బాబు, ఎయిడెడ్ పాఠశాలల కన్వీనర్ కె శ్రీనివాసరావు, యుటిఎఫ్ బాపట్ల జిల్లా శాఖ అధ్యక్షులు జే వినయ్ కుమార్, జిల్లా కార్యదర్శులు, రాష్ట్ర కౌన్సిలర్లు, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

30న విజయవాడలో జరిగే

మహాధర్నాను జయప్రదం చేయండి

రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వలేటి కృష్ణయ్య పిలుపు

ప్రజాశక్తి-పర్చూరు

వ్యవసాయాన్ని కాపాడుకోవాలంటే స్వామినాథన్ కమిటీ సిఫారసులను అమలు చేయాలని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వలేటి కృష్ణయ్య అన్నారు. పర్చూరు సిపిఎం కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశం లో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఈ నెల 30వ తేదీన విజయవాడలో జరుగుతున్న రైతు సమస్యలపై జరిగే మహాధర్నాకు పర్చూరు ప్రాంతంలో రైతులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు. ప్రాంతాల వారీగా రైతు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనేక మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నార న్నారు. రైతు ఆత్మహత్యల్లో ఆంధ్రప్రదేశ్ మూడో స్థానంలో ఉందని గుర్తు చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విత్తన చట్టం అమలు చేయాలని, బీమా పథకం, ఇన్‌పుట్ సబ్సిడీ రైతులకు అందేలా చూడాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. అదాని సంస్థలకు లాభాలు చేకూర్చే కేంద్ర ప్రభుత్వ విధానాలను వైసీపీ తు.చ తప్పకుండా అమలు చేస్తోందని విమర్శించారు. సమావేశానికి జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షులు బండి శంకరయ్య అధ్యక్షత వహించారు. సమావేశంలో నల్లమడ రైతు సంఘం నాయకులు నరిశెట్టి ఆచార్యులు, జిల్లా రైతుసంఘం సహాయ కార్యదర్శి వి శ్రీనివాసరెడ్డి, అడ్డగడ సాంబయ్య, కన్నెగంటి సాంబశివరావు, ముప్పా సుబ్బారావు, రైతులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణయ్య

సేవే లక్ష్యంగా ఏలూరి ట్రస్ట్

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

అంధత్వ నివారణే లక్ష్యంగా ఏలూరి చారిటబుల్ ట్రస్ట్, నోవా అగ్రి గ్రూప్స్ ఆధ్వర్యంలో శంకర్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో గత 15 సంవత్సరాలుగా ఉమ్మడి ప్రకాశం జిల్లా వాసులకు ఉచిత కంటి వైద్య శిబిరాలు బాపట్ల టిడిపి పార్లమెంట్ అధ్యక్షులు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు నిర్వహిస్తున్నట్లు టిడిపి నాయకులు కామేపల్లి హరిబాబు, తెలుగు మహిళా అధ్యక్షురాలు ఉప్పుటూరి రమాదేవి అన్నారు. ఆదివారం మార్టూరు జిల్లా పరిషత్ హై స్కూల్ ఆవరణలో నిర్వహించిన ఏలూరి ఉచిత కంటి మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్య శిబిరానికి 1,214 మంది హాజరు కాగా, 612 మందికి శస్త్ర చికిత్సకై వైద్యులు రిఫర్ చేశారు. ముందుగా నందమూరి తారక రామారావు విగ్రహానికి, ఏలూరి నాగేశ్వరరావు చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కంటి వైద్య శిబిరాన్ని టిడిపి నాయకులు ప్రారంభించారు. ఈ శిబిరంలో బీపీ, షుగర్, రక్త పరీక్షలు నిర్వహించారు. అనంతరం కంటి పరీక్షలు చేపట్టారు. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన ఓపి మధ్యాహ్నం మూడు గంటల వరకు కొనసాగింది. మహిళలకు, వృద్ధులకు వేరువేరుగా ఓపి క్యూలైన్‌లు ఏర్పాటు చేసి ప్రత్యేకంగా పరీక్షలు నిర్వహించారు. పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించాలనే లక్ష్యంగా మోకాళ్ల ఆపరేషన్లు, కంటి వైద్య శిబిరాలు, మెడికల్ క్యాంపులు నిర్వహిస్తూ సమాజ సేవలో ఏలూరి సాంబశివరావు నిలుస్తున్నారని వారు కొనియాడారు. లక్ష మందికి ఉచిత కంటి శస్త్ర చికిత్సలు అందించాలని లక్ష్యంగా ఏలూరి చారిటబుల్ ట్రస్ట్, నోవా అగ్రి గ్రూప్స్ ఆధ్వర్యంలో క్యాంపులు నిర్వహిస్తున్నట్లు టిడిపి నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి రజాక్, తాటి నాగేశ్వరరావు, కామినేని జనార్దన్, ఫారుక్, గొట్టిపాటి వెంకటరావు, చిరంజీవి, కమ్మ శివ నాగేశ్వరరావు, రామకృష్ణ, మల్లి, రవి, కన్నెగంటి శీను, కిషోర్, జంపని సాంబశివరావు, ముప్పాల హరిబాబు, సెల్ సుభాని తదితరులు పాల్గొన్నారు.



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న టిడిపి నాయకులు

కరాటేలో విజేతలుగా నిలిచిన చిన్నారులు

కరాటేలో చిన్నారుల ప్రతిభ

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

ఇంకొల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎన్‌టిఆర్ కళాప్రాంగణంలో జరిగిన కరాటే పరీక్షల్లో ఇంకొల్లు విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. వేసవిలో శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. బ్రౌన్ బెల్ట్‌ను 8 మంది, బ్లూ బెల్ట్ 1, ఆరంజ్ బెల్ట్ 6, గ్రీన్ బెల్ట్ ఐదుగురు సాధించినట్లు కరాటే మాష్టారు తేళ్ల అంకమ్మ చౌదరి వివరించారు. చిన్నారులను పంపిన తల్లిదండ్రులను ఈ సందర్భంగా అభినందించారు. విజేతలు భవిష్యత్తులో ఇంకా మంచి బహుమతులు సాధించాలని ఆకాంక్షించారు.

గోడ పత్రిక ఆవిష్కరిస్తున్న జెవివి నాయకులు

శాస్త్రీయ సమాజ నిర్మాణమే లక్ష్యం: జెవివి

ప్రజాశక్తి-చీరాల

సమాజంలో మూఢనమ్మకాలను పారద్రోలి శాస్త్రీయ సమాజ నిర్మాణమే లక్ష్యంగా జన విజ్ఞాన వేదిక పనిచేస్తుందని వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు కుర్ర రామారావు అన్నారు. ఆదివారం పట్టణంలోని కేజీఎం బాలికోన్నత పాఠశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం గోడపత్రికను ప్రతినిధులు ఆవిష్కరించారు. పాఠశాల హెచ్‌ఎం కృష్ణమోహన్ రావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జేవీవీ రాష్ట్ర నాయకులు కుర్రా రామారావు మాట్లాడుతూ అనాగరిత నుంచి నాగరికతలో మానవుడు నిరంతరం అభివృద్ధి చెందుతున్నాడంటే దానికి మూలం సైన్సు ఒక్కటేనని గుర్తు చేశారు. ప్రజలలో మూఢనమ్మకాలను పారద్రోలి ఆధునిక సమాజంవైపు నడిపించేందుకు జేవీవీ అనేక కార్యక్రమాలు చేపడుతోందని చెప్పారు. నేటికీ మూఢనమ్మకాలతో జీవిస్తున్న వారిని చైతన్య పరిచేందుకు విద్యార్థులు, ఉద్యోగులు, మేధావులు, మహిళలు ఇలా అనేక మందిని చైతన్య పరిచేందుకు రాష్ట్ర వ్యాప్తంగా కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. జేవీవీ సభ్యత్వం ప్రతి ఒక్కరూ తీసుకొని విజ్ఞానంతో అడుగులు వేయాలని చెప్పారు. కార్యక్రమంలో జేవీవీ యూత్ కోకన్వీనర్ వెంకటేష్, పిచ్చయ్య, వెంకటేశ్వరరెడ్డి, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరంలో ఆదిత్య పరీక్ అసమాన సేవ

సామాజిక సేవలో విద్యార్థి

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

చిరుప్రాయంలోనే ఆ విద్యార్థి అందిస్తున్న సామాజిక సేవలకు సర్వత్రా ప్రశంసల జల్లు కురుస్తోంది. హైదరాబాదులోని బంజారాహిల్స్ మెరిడియన్ స్కూల్‌లో ఇంటర్ చదువుతున్న ఆదిత్య పరీక్ చిన్ననాటి నుంచి సేవా గుణాన్ని అలవర్చుకున్నాడు. సమాజంలోని రుగ్మతల పట్ల, ప్రజా చైతన్యానికి, ప్రజలకు వ్యాధుల పట్ల ధైర్యాన్ని కల్పిస్తూ.. ప్రజల్లో అవగాహన కల్పిస్తూ.. చైతన్యం చేస్తూ.. సమాజ హితం కోసం అహర్నిశలు పాటు పడుతున్నాడు. ఆదివారం మార్టూరులో నిర్వహించిన ఏలూరి ఉచిత వైద్య శిబిరంలో వృద్ధులకు, ప్రజలకు కంటిచూపు పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలపై అవగాహన కల్పించారు. ఆదిత్య చేస్తున్న సేవలను శిబిరంలో పాల్గొన్న పలువురు అభినందించారు.

పేదలను విద్యకు దూరం చేసేందుకు కుట్ర

ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ అధ్యక్షుడు కంకణాల ఆంజనేయులు

ప్రకాశం- పొదిలి

పేదలను విద్యకు దూరం చేయడమే మోడీ లక్ష్యమని ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా అధ్యక్షుడు కంకణాల ఆంజనేయులు తెలిపారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సమావేశం స్థానిక పెన్షనర్స్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు కె.విజయ్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ నూతన విద్యా విధానం పేరుతో కేంద్ర ప్రభుత్వం విద్యను ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ, కాషాయీకరణ చేస్తుందన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటు పరం చేసి నిరుద్యోగులను పెంచుతుందని విమర్శించారు. మతాల పేరుతో విధ్వంసాన్ని సృష్టిస్తుందన్నారు. మోడీ విధానాన్ని ప్రశ్నిస్తున్న తులసి చందు లాంటి జర్నలిస్టులను బెదిరింపులకు గురిచేస్తున్నట్లు తెలిపారు. తులసి చందుకు విద్యార్థి లోకం అండగా ఉండాలన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వినోద్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ విద్యారంగం కునారిల్లుతుందని తెలిపారు. ఆర్భాటపు ప్రచారమే తప్ప ఆచరణలో ఉపయోగపడే పనులను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించడం లేదన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉచిత పాఠ్యపుస్తకాల సరఫరాను నిలిపివేసినటు తెలిపారు. హాస్టల్ విద్యార్థులకు ప్రభుత్వం ఇస్తున్న మెస్ ఛార్జీలు ఏ మాత్రం సరిపోవన్ని తెలిపారు. వార్డెన్లపై ప్రభుత్వం అధిక భారాన్ని మోపుతుందన్నారు. పెడింగ్ బిల్లులు విడుదల చేయడం లేదని విమర్శించారు. విద్యా దీవెన, వసతి దీవెన ఫీజులు పెడింగ్‌లో ఉన్నాయని తెలిపారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులపై ఫీజుల భారం పడుతుందన్నారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో అధిక సంఖ్యలో టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆ ఖాళీలను భర్తీ చేయాలన్నారు. పై సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు నిర్వహించాలని సమావేశంలో తీర్మానించినట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కంకణాల ఆంజనేయులు

'వెలిగొండ'పై నాటకం : టిడిపి

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణ విషయంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి,మంత్రి సురేష్ స్థానికులు మోసం చేస్తున్నారని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్దన్ ఆరోపించారు. భవిష్యత్‌కు గ్యారెంటీ పేరుతో తెలుగుదేశం పార్టీ నిర్వహిస్తున్న చైతన్య రథం బస్సు యాత్ర పెద్దదోర్నాల మండలంలోని చిన్నగుడిపాడు గ్రామానికి ఆదివారం చేరుకుంది. జోరు వర్షంలో నేతలు సభను నిర్వహించారు. సభకు టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా దామచర్ల జనార్దన్ మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్ చంద్రబాబు మీదే ఆధారపడి ఉందని తెలిపారు. టిడిపి ప్రకటించిన సంక్షేమ పథకాలు అమలు చేస్తేనే రాష్ట్రం ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఒక్క ఛాన్స్ అంటూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధి, పరిశ్రమలు లేక యువత భవిష్యత్‌కు గ్యారెంటీ లేకుండా పోయిందన్నారు. అనంతరం వైసిపి రాళ్లదాడిలో మృతి చెందిన రాజయ్య కుటుంబాన్ని పరామర్శించి రూ. 10 లక్షల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి పార్లమెంట్ అధ్యక్షుడు నూకసాని బాలాజీ, కొండపి ఎమ్మెల్యే డోలా బాలవీరాంజనేయులు, టిడిపి కనిగిరి నియోజక వర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి, గిద్దలూరు ఇన్‌ఛార్జి ముత్తుముల అశోక్‌రెడ్డి, టిడిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర నాయకులు పిల్లి మాణిక్యాలరావు, నాయకులు డాక్టర్ మన్నె రవీంద్ర, ఏరువ మల్లికార్జునరెడ్డి, అంబటి వీరారెడ్డి, దొడ్డా శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న టిడిపి నాయకులు

పేదల సంక్షేమానికి కృషి : వరికూటి

ప్రజాశక్తి-టంగుటూరు

పేదల సంక్షేమానికి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నట్లు వైసిపి కొండపి నియోజక వర్గ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్‌బాబు తెలిపారు. మండల పరిధిలోని కారుమంచి గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. తొలుత వరికూటి అశోక్ బాబు - లక్ష్మీ దంపతులకు గ్రామస్తులు, వైసిపి నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అశోక్ బాబు గడప గడపకూ తిరిగి గత నాలుగేళ్లలో ఆయా కుటుంబాలకు ప్రభుత్వం ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి ప్రచార విభాగం జిల్లా అధ్యక్షుడు చింతపల్లి హరిబాబు, తహశీల్దార్ కొల్లిబోయిన సంజీవరావు, ఎంపిడిఒ రత్నజ్యోతి, వైసిపి నాయకులు ఆనం సత్యనారాయణ రెడ్డి, మల్లవరపు రాఘవరెడ్డి, చక్కా రాజేశ్వరరావు, వాకా బాలకష్ణారెడ్డి, మొలకలపల్లి సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకులో వరికూటి అశోక్‌బాబు

బాధితుడికి మాజీ మంత్రి శిద్దా పరామర్శ

ప్రజాశక్తి-దర్శి

దర్శిలో మేడా హనుమంతరావుకు చెందిన అభి షాపింగ్ మాల్ అగ్ని ప్రమాదంలో శనివారం దగ్ధమైంది. ఈ విషయం గురించి తెలుసుకున్న మంత్రి శిద్దా రాఘవరావు బాధితుడు మేడా హనుమంతరావు ఆదివారం పరావ ర్శించారు. అగ్ని ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్యనాయకులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

హనుమంతరావును పరామర్శిస్తున్న శిద్దా

నిత్యావసరాలు అందజేస్తున్న టిడిపి నాయకులు

నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దనరావు ఆదేశాల మేరకు 50 డివిజన్‌లో 25 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులు. కూరగాయలు ఆదివారం పంపిణీ చేశారు. టిడిపి మినీ మేనిఫెస్టోపై డివిజన్‌లో ప్రచారం చేశారు.ఈ కార్యక్రమంలో టౌన్ బిసి సెల్ అధ్యక్షుడు నిడమానూరు రమేష్, టౌన్ ప్రధాన కార్యదర్శి కంచాల శ్రీనివాసరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ వెల్లటూరు వేణు, మానేపల్లి గోవిందాచారి, కార్యదర్శులు పెద్ద సింగు వెంకట్రావు, పిల్లి మధు పోలయ్య చంద్ర, రాష్ట్ర కార్యదర్శి పొదిలి శీను, టౌన్ అధ్యక్షుడు కొటారి నాగేశ్వరావు, రాష్ట్ర బిసి సెల్ సెక్రటరీ ఆవులు శ్రీను, పార్లమెంట బిసి సెల్ సెక్రటరీ నిడమానూరి హనుమంతరావు, రజక సాధికార కమిటీ సభ్యులు మద్దిపూడి శ్రీనివాసరావు, డివిజన్ అధ్యక్షుడు చింతపల్లి రాంబాబు, సోమిశెట్టి శ్రీనివాసరావు, చేరెడ్డి వెంకటేశ్వర్లు, కోట పుల్ల కపారావు, షబ్బీర్, జిలాని, అహ్మద్, నాసర్ వలి, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కరించాలని నిరసన

ప్రజాశక్తి- ఒంగోలుసబర్బన్

తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ సిపిఎం కొప్పోలు శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం నగర కార్యదర్శి జి.రమేష్ మాట్లా డుతూ కొప్పోలు చెరువును సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుగా మార్చాలన్నారు. పాత పైపులైన స్థానంలో పెద్ద సైజు పైపులు వేయాలన్నారు. ఏడు రోజులకు ఒకసారి కాకుండా మూడు రోజులకు ఒకసారి నీటిని సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. చెరువులోని చేపలను తొలగించి శుభ్రం చేసి మంచినీరు చెరువుగా మార్చాలన్నారు. ఫిల్టర్ బెడ్ ఏర్పాటు చేసి సమ్మర్ స్టోరేజీ ట్యాంకుగా మార్చాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కొప్పోలు శాఖ కార్యదర్శి ఎస్.హనుమంతరావు, శాఖ సభ్యులు బోడపాటి రాఘవరావు, మదిర ఆదినారాయణ గంగాడి నాగేశ్వరరావు, ముచ్చు వెంకట్రావు, గ్రామ పెద్దలు రావి శ్రీనివాసులు గంగాడి లింగయ్య, కావూరి కష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న నాయకులు

శింగరాయకొండ ఎస్ఐగా శ్రీరామ్

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ ఎస్ఐగా టి.శ్రీరామ్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ ఎస్ఐగా పనిచేస్తున్న ఫిరోజా ఫాతిమా ఒంగోలు దిశ పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు. దీంతో ఆమె స్థానంలో జిల్లా వీఆర్‌లో ఉన్న శ్రీరామ్ ఇక్కడ విధుల్లో చేరారు. బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ శ్రీరామ్ సిఐ దాచేపల్లి రంగనాథ్, ఒంగోలు డిఎస్‌పి నారాయణస్వామిరెడ్డి, వైసిపి కొండపి నియోజక వర్గ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్‌బాబును మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

మద్దిపూడి ఎస్ఐగా బసవరాజు

ప్రజాశక్తి-మద్దిపూడి

మద్దిపూడి ఎస్ఐగా బసవరాజు సిహెచ్.శివ బసవరాజు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకెళ్లితే పరిష్కరిస్తానన్నారు. వాహనదారులు రహదారి భద్రతలు పాటించాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు తప్పవన్నారు.

దోర్నాల ఎస్ఐగా అంకమరావు

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

పెద్దదోర్నాల ఎస్ఐగా అంకమరావు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ చేస్తున్న శ్రీనివాసరావు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో మద్దిపూడి ఎస్ఐగా పనిచేస్తున్న అంకమరావు ఇక్కడ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ అంకమరావు మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతలను కాపాడటానికి, ఎలాంటి అవాంఛనీయ ఘటనలో చోటు చేసుకుండా చర్యలు తీసుకుంటామన్నారు.



ఎస్ఐను సన్మానిస్తున్న నాయకులు

ఎస్ఐ శివనాగరాజుకు సన్మానం

ప్రజాశక్తి-హనుమంతునిపాడు

హనుమంతునిపాడు ఎస్ఐగా శివనాగరాజు బాధ్యతలు స్వీకరించారు. అందులో భాగంగా టిడిపి మండల అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో టిడిపి నాయకులు ఎస్ఐను ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ గ్రామాల్లో శాంతి భద్రలు కాపాడేందుకు తన వంతు కృషి చేస్తామని తెలిపారు. ప్రజలకు ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జి గాయం తిరుపతిరెడ్డి, మురహరి నరసయ్య, చీకటి వెంకటసుబ్బయ్య, గాయం రామిరెడ్డి, కందుల వెంకట సుబ్బారెడ్డి, కూడాలి దశరథ, బిసిసెల్ అధ్యక్షుడు బాలనారాయణ, రామకష్ణ, రఘునాథ కాశిరెడ్డి, వేములపాడు సర్పంచి తిరుపతయ్య, టిడిపినాయకులు, కార్యకర్తలు తదితులు పాల్గొన్నారు.

వైసిపి ఆధ్వర్యంలో..

ఎస్ఐ శివనాగరాజును వైసిపి నాయకులు ఉడుముల సుబ్బారెడ్డి, కత్తి తిరుపాలు, ఉప సర్పంచి కత్తి కిషోర్, కొండం రాజు,కోలా గురవయ్య మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్మీజవాన్‌కు ఎమ్మెల్యే నివాళి

ప్రజాశక్తి- కొమరోలు

మండల పరిధిలోని నల్లగుంట్ల గ్రామానికి చెందిన దండు చిన్న రంగయ్య (45) ఆర్మీలో జనరల్ రిజర్వ్ ఇంజనీరింగ్ ఫోర్స్ లో విధులు నిర్వహి స్తున్నాడు. ఆయన గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన మృతదేహానికి స్వగ్రామంలో సైనిక-ప్రభుత్వ లాంఛనాలతో ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబు చిన్న రంగయ్య మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ప్రభుత్వం ద్వారా అన్ని విధాలుగా ఆదుకుంటామని రంగయ్య కుటుంబానికి హామీ ఇచ్చారు.

7న ఒంగోలులో సెమినార్

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

వ్యవసాయ రంగ సంక్షోభం, పరిష్కార మార్గాలు అనే అంశంపై వచ్చేనెల 7న ఒంగోలులోని బృందావన కల్యాణ వేదికలో సెమినార్ నిర్వహించనున్నట్లు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గాలి వెంకటరామిరెడ్డి ఆదివారం తెలిపారు. ఈ సెమినార్‌ను జయప్రదం చేయాలని కోరుతూ రైతులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గాలి వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ తక్కువ వర్షపాతం, తక్కువ నీటి సదుపాయం, నిరంతరం కరువుతో ఉండే ప్రకాశం జిల్లాకు తగిన కేటాయింపులు లేవన్నారు. వెలుగొండ, పాలేటిపల్లి అరకొరగానే మిగిలాయని చెప్పారు. గుండ్లకమ్మ ప్రాజెక్టు గేట్లు విరిగిపోయి సంవత్సరం అయిందన్నారు. నిరంతా వృథాగా పోతున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సెమినార్‌లో రైతు సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి విజుకృష్ణన్, రాజకీయ విశ్లేషకులు కె. నాగేశ్వర్, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య పాల్గొంటారని తెలిపారు. రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కోటా వెంకటరెడ్డి, పక్కా ఆవులయ్య, ఉప్పలపాటి రమేష్, కందుల ప్రభాకర్, గుర్రం లక్ష్మీ నారాయణ పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

నల్లమల అటవీ ప్రాంతంలోని ఇష్టకామేశ్వరి, నెక్కంటి, పొన్నలబయలు తదితర గిరిజన గూడేల్లో పాలుట్ల ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ పి.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చెంచు గిరిజనులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. గర్భిణులు, చిన్నారులకు టీకాలు వేశారు. రక్తహీనతతో బాధపడే రోగులకు ఐరన్ మాత్రలు, టానిక్‌లు, ప్రొటీన్ పౌడర్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఎ డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌ఒ డాక్టర్ శ్రీనివాసరావు, వైద్య సిబ్బంది మాధవిలత, జ్యోతిరాణి, జానారెడ్డి, బాషా, శ్రీనివాసులు, నలగాటి వెంకట్రామయ్య నాయుడు, కొండయ్య, అంజమ్మ పాల్గొన్నారు.

శరవేగంగా రోడ్డు నిర్మాణ పనులు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం పట్టణంలోని ఎస్‌టి కాలనీకి మసీదు దగ్గర నుంచి, ఐటియా షోరూం దగ్గర నుంచి రెండు మార్గాలు మాత్రమే ఉన్నాయి. అయితే కాలనీ మాత్రం ఐదు వీధులుగా విస్తరించి ఉంది. నాలుగు వీధులకు కలుసుకొని ప్రధాన రహదారికి రావటానికి రోడ్డు మార్గం లేదు. దీంతో ఏదైనా ప్రమాదం, అపాయం జరిగినా ఆ కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీసం ఫైరింజన్, అంబులెన్స్ వచ్చే పరిస్థితి కూడా లేదు. దీంతో తమ ఇబ్బందులను రాష్ట్ర పురపాలక, పట్టపాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్‌కు వివరించారు. పాత ఫైర్ స్టేషన్ దగ్గర నుంచి రహదారి సౌకర్యం కల్పించాలని కోరారు. స్పందించిన మంత్రి సురేష్ 8 అడుగుల విస్తీర్ణం కలిగిన రహదారిని ఏర్పాటు చేయాలని రెవెన్యూ, పంచాయితీ అధికారులను ఆదేశించారు. వారు కొలతలు వేసి ఎన్‌జిఒలకు కేటాయించిన స్థలంలో కొంత రహదారి ఏర్పాటుకు సేకరించారు. ఆక్రమణలో ఉన్న కొందరి స్థలాలను సరి చేసి రహదారి పనులను యుద్ధప్రాతికన నిర్వహించారు. కొన్ని దశ్థాల నుంచి ఇబ్బంది పడుతున్న తమకు రహవారి సౌకర్యం కల్పించిన మంత్రి సురేష్‌కు ఈ సందర్భంగా ఎస్‌టి కాలనీ వాసులు కృజ్ఞతలు తెలిపారు.

'నల్లమల'లో మంత్రి సురేష్

- రెండు రోజుల పాటు గిరిజనులతో మమేకం
- మంత్రిని అక్కున చేర్చుకున్న అడవి బిడ్డలు
- రాజశేఖర్‌రెడ్డి విగ్రహం ఆవిష్కరణ

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

పాలుట్ల గ్రామం దట్టమైన నల్లమల అభయారణ్యంలో ఉంది. దానికి యర్రగొండపాలెం నుంచి 47 కిమీ దూరం. గంజివారిపల్లి నుంచి పాలుట్ల వరకూ అభయారణ్యం 37 కిమీ ఉంటుంది. ఈ 37 కిమీ ప్రయాణించడానికి మంచి కండీషన్ ఉన్న వాహనం అయితే సుమారు ఐదు గంటలు పడుతుంది. వాగులు, వంకలు, డొంకలు, గుట్టలు, కొండలు దాటాలి. ఎలుగుబంటి, చిరుతపులి, పులి, కొండ చిలువ, విషసర్పాల బారీ నుంచి తప్పించుకొని పాలుట్ల చేరాలి. ఇది పెద్ద సాహసమే మరి.

రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ఆ సాహసం చేశారు. రెండు రోజులు పాటు గిరిజనులతో గడపటానికి పక్కా వ్యూహం సిద్ధం చేసుకున్నారు. పాలుట్ల వెళ్లడానికి తన వాహనాలు పనికి రాకపోవడంతో ప్రత్యేకంగా మంత్రి, ప్రజా ప్రతినిధులు, అధికారులకు 15 జీపులను సిద్ధం చేసుకున్నారు. అటవీ ప్రాంతంలోని పెద్దమ్మ తల్లికి పూజలు నిర్వహించి పాలుట్ల బాట పట్టారు. క్రూర మృగాలను తప్పించుకుంటూ వాగులు, వంకలు, డొంకలు, గుట్టలు, కొండలు దాటుకుంటూ ఎట్టకేలకు పాలుట్లకు చేరారు.

వైఎస్ఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి సురేష్

సచివాలయ భవనం ప్రారంభం

రూ. 40 లక్షల వ్యయంతో పాలుట్ల గిరిజన గూడెంలో నిర్మించిన సచివాలయాన్ని, రూ. ఐదు లక్షల వ్యయంతో నిర్మించిన సిమెంట్ రోడ్డును ప్రారంభించారు. అక్కడి నుంచి ఇంటింటికి తిరుగుతూ గిరిజనులను ఆప్యాయంగా పలకరించారు. గిరిజనులు కూడా మంత్రి సురేష్‌ను అక్కున చేర్చుకున్నారు. రాత్రికి అక్కడే బస చేసి గిరినులతో గడిపారు.

రెండోరోజు తగ్గని ఆదరణ..

పాలుట్లలో మంత్రి సురేష్‌కు రెండో రోజు కూడా గిరిజనుల నుంచి రెట్టింపు ఆదరణ లభించింది. జగనన్న పాలనలోనే తామంతా అభివృద్ధి చెందామని, తమ పిల్లలు బాగా చదువుకుంటున్నారని, చాలా మంది ఉద్యోగాలు కూడా చేస్తున్నారని వివరించారు.

గిరిజనులకు రుణపడి ఉంటా : మంత్రి సురేష్

పాలుట్ల గిరిజనులకు రుణపడి ఉంటానని మంత్రి తెలిపారు. దట్టమైన నల్లమల అటవీ ప్రాంతంలో తమ అభిమాన నాయకుడు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించడం తన అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. రెండు రోజులు పాటు గిరిజనులతో గడపడం తన జీవితంలో మరచిపోలేనని తెలిపారు. గిరిజనులు చూపిన ఆదరాభిమానాలు ఎప్పటికీ మరిచి పోనని తెలిపారు.

'రెడ్డి వివాహ పరిచయ వేదిక'కు స్పందన

ప్రజాశక్తి-మార్కాపురం

రెడ్డి సంక్షేమ సేవా సంఘం మార్కాపురం నియోజకవర్గ కన్వీనర్ గుంటక సుబ్బారెడ్డి అధ్యక్షతన స్థానిక శ్రీరెడ్డి మహిళా కళాశాలలో ఆదివారం నిర్వహించిన రెడ్డి వివాహ పరిచయ వేదికకు స్పందన లభించింది. రెడ్డి పరిచయ వేదికలో మార్కాపురం, పొదిలి, కొనకనమిట్ల, తర్లుపాడు మండలాలకు చెందిన అవివాహితులు వారి కుటుంబ పెద్దలు పాల్గొన్నారు. సుమారు 120 మంది అవివాహితుల వివరాలతో దరఖాస్తులు అందించారు. ఈ సందర్భంగా రెడ్డి సంక్షేమ సేవా సంఘం మార్కాపురం నియోజకవర్గ కన్వీనర్ గుంటక సుబ్బారెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో ఎవరి పనుల్లో వారు బిజీగా గడుపుతున్నారన్నారు. పెళ్లీడుకు వచ్చిన అమ్మాయి, అబ్బాయిలకు వివాహాలు జరిపేందుకు మ్యారేజ్ బ్యూరోలను ఆశ్రయించాల్సి వచ్చిందన్నారు. రెడ్డి సోదరుల కోసం ప్రత్యేకంగా వివాహ పరిచయ వేదికను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ వేదిక ద్వారా వధువు, వరుడు ఎక్కడ ఉన్నారు.. వారి స్థితి గతులేమిటి అని ఈ వేదిక ద్వారా తెలుసుకోవడం సులువుగా ఉందన్నారు. ఇలాంటి వేదిక ద్వారా వివాహాలు కుదుర్చుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఇప్పటి వరకు 40 పెళ్లిళ్లు కుదిర్చిటన్లు తెలిపారు. ఇలాంటి వేదికలను కొనసాగిస్తూనే ఉంటామని చెప్పారు. పెళ్లీడుకు వచ్చి... పెళ్లి కాని వారు పూర్తి వివరాలతో తమను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సంఘం ప్రతినిధులు కర్ణ నరసింహారెడ్డి, బట్టగిరి శివారెడ్డి, తిరుమలరెడ్డి రామిరెడ్డి, కుందూరు రమణారెడ్డి, నారాయణరెడ్డి, కుందురు మల్లారెడ్డి, ఏరువ వెంకటరెడ్డి, గుంటక భాస్కర్‌రెడ్డి, బత్తుల వెంకటరెడ్డి, గోరంట్ల వెంకటరెడ్డి, రావి చెంచిరెడ్డి, ఆర్‌వి.సుబ్బారెడ్డి, చదలవాడ రామిరెడ్డి, గొట్టం సూర్యనారాయణరెడ్డి, రావి లక్ష్మిరెడ్డి, దొండేటి వెంకటేశ్వర్‌రెడ్డి, రామకష్ణారెడ్డి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న గుంటక సుబ్బారెడ్డి

ప్రభుత్వ భూములు పేదలకు పంచాలి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

మండల పరిధిలోని సాయిబాబా నగర్‌లో రెండు దశాబ్దాలుగా ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములను అర్హులైన పేదలకు పంచాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గాలి వెంకటరామిరెడ్డి కోరారు. సాయిబాబా నగర్‌లో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెనాలి ప్రాంతానికి చెందిన చాలా మంది మూడు, నాలుగు దశాబ్దాల కిందట ఈ ప్రాంతానికి వచ్చి సాయిబాబా నగర్‌లో ప్రభుత్వ భూములకు పట్టాలు పొంది సాగు చేసుకుంటున్నారు. భూగర్భ జలమట్టం పూర్తిగా తగ్గిపోవడంతో తెనాలి ప్రాంతం వారంతా తమ భూములను వదిలేసి రెండు దశాబ్దాల కొందటే వెళ్లిపోయారని తెలిపారు. అప్పటి నుంచి ఆ భూములు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. ప్రభుత్వ వారి పట్టాలను రద్దు చేసి అర్హులైన పేదలకు పట్టాలివ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప్పలపాటి రమేష్, గుర్రం లక్ష్మీ నారాయణ పాల్గొన్నారు.

భూములను పరిశీలిస్తున్న గాలి వెంకట రామిరెడ్డి

రెచ్చిపోతున్న ఇసుక మాఫియా

ప్రజాశక్తి- కొమరోలు

మండల పరిధిలోని హనుమంతరాయునిపల్లి గ్రామ సమీపంలోని దామర్ల చెరువులో మట్టి మాఫియా రెచ్చిపోతుంది. రెండు జెసిబిలు, 10 ట్రాక్టర్లతో అక్రమంగా మట్టిని తరలిస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు రోజుల్లో మరింత రెచ్చిపోతున్నారు. ఆదివారం పెద్దఎత్తున మట్టిన తరలించారు. గత కొంతకాలంగా మట్టి మాఫియా ఇదేవిధంగా మట్టిని తరలిస్తుంది. చెరువులోని మట్టిని అక్రమంగా తరలించి ట్రాక్టర్ రూ.500 నుంచి రూ. 600 వరకూ విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. అయినప్పటికీ అధికారులు పట్టించు కోవడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మట్టి మాఫియా ఆగడాలను అరికట్టి అక్రమంగా మట్టితరలింపునకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-చీమకుర్తి

చీమకుర్తి మండలం బూదవాడ పంచాయతీ పరిధిలోని మర్రిచెట్లపాలెంలో రూ.20 లక్షలతో నిర్మిస్తున్న సిసి రోడ్డు నిర్మాణానికి ఎంపిపి యద్దనపూడి శ్రీనివాసరావు ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు, సర్పంచి జె మరియమ్మ, ఎంపిటిసి పాపిరెడ్డి, సుశీలమ్మ, కోటేశ్వరరావు,యాకోబు పాల్గొన్నారు.

కౌసిక్ రెడ్డి క్షమాపణ చెప్పాలి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

తెలంగాణాలో ముదిరాజ్ సామాజిక వర్గాన్ని కించ పరుస్తూ ఎమ్మెల్యే కౌసిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యాలకు భేషరతుగా క్షమాపణ చెప్పాలని ముదిరాజ్ యువసేన ఎపి రాష్ట్ర పోగ్రామ్స్ కమిటీఅ వైస్ చైర్మన్ పోతుల ఆదినారాయణ డిమాండ్ చేశారు. కౌసిక్ రెడ్డికి ఎమ్మెల్సీ పదవిలో కొన సాగేందుకు అర్హత లేదన్నారు. వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కౌసిక్ రెడ్డిని బర్తరఫ్ చేసే వరకూ ముదిరాజ్ యువసేన ఆధ్వర్యంలో నిరసన తెలుపుతామని ఆయన హెచ్చరించారు.

గర్నెపూడి యేబుకు సన్మానం

ప్రజాశక్తి-దర్శి

దర్శికి చెందిన కవి గర్నెపూడి యేబు తెలుగు వెలుగు సాహితి వేదిక స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో తెలుగు వెలుగు జాతీయ కవిరత్న అవార్డును ఆదివారం అందజేశారు. గుంటూరులో నిర్వహించిన కార్యక్రమంలో నిర్వాహకులు యేబుకు అవార్డు, జ్ఞాపిక అందజేసి సన్మానించారు.

మూసివేత దిశగా 'హెరిటేజ్'

ఆందోళనలో కార్మికులు

ప్రజాశక్తి-భట్టిప్రోలు

గత ఇరవై ఏళ్లుగా భట్టిప్రోలులో నడుస్తున్న హెరిటేజీ ఫుడ్ ప్రొడక్ట్ కంపెనీని యాజమాన్యం అర్ధాంతరంగా మూసివేతకు రంగం సిద్ధం చేసింది. దీనిలో పని చేసే కార్మికులు, సిబ్బందికి ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే మూసివేసేందుకు ప్రణాళికలు రూపొందించారు. దీంతో ఇక్కడ పనిచేసే సుమారు 70 మందికి పైగా కార్మికుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. దీనిలో శాశ్వత ఉద్యోగులు దాదాపు 35 మంది వరకు ఉండగా దినసరి కూలీలుగా మరో 30 మంది, ఇక్కడ తయారుచేసే పాల ప్యాకెట్లు, పెరుగు, మజ్జిగ వంటి ప్యాకెట్లను తరలించే వాహన డ్రైవర్లు మరో 10 మందికి పైగా ఉన్నారు. వీరిలో శాశ్వత ఉద్యోగులు ఇక్కడ అందించే వేతనానికే మరో ప్రాంతంలో ఉన్న కంపెనీలో చేర వచ్చు. లేకుంటే ఉద్యోగం మానుకోవచ్చు అనే నిబంధనను యాజమాన్యం వెలుబుచ్చింది. కాగా రోజుకు 380 రూపాయలకు పనిచేసే కార్మికుల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. దినసరి కూలీలకు కూడా కంపెనీ నిబంధనల ప్రకారం పిఎఫ్, ఈఎస్ఐ వంటి సౌకర్యాలు కూడా ఉన్నాయి. వీరు కూడా కంపెనీ ఏర్పడిన నాటి నుంచి ఇక్కడ పని చేస్తున్నారు. వీరికెవ్వరికీ ఇప్పటివరకు కంపెనీ మూసివేస్తున్నట్లు సమాచారం కూడా తెలియనీయకుండా గోప్యంగా ఉంచినట్లు తెలుస్తోంది. ఇప్పటికే గత నెల రోజులుగా ఫలానా తేదీన మూసివేస్తున్నామని అంటూ నాలుగుసార్లు కంపెనీ ఉన్నతాధికారుల నుంచి సమాచారం వచ్చినట్లు అక్కడ పనిచేసే పలువురు సిబ్బంది తెలిపారు. ప్రస్తుతం మరో రెండు మూడు రోజులలో ఇక్కడ కంపెనీని అర్ధాంతరంగా మూసివేయటానికి ఏర్పాట్లు జరుగుతున్నట్లు పలువురు చెబుతున్నారు. 2003 సంవత్సరంలో ఏర్పాటు చేసిన ఈ కంపెనీలో తయారు చేసే ఆహార ఉత్పత్తులు ఉమ్మడి గుంటూరు జిల్లా, కష్ణా, ప్రకాశం జిల్లాలకు లారీల ద్వారా సరఫరా అవుతుంటాయి. రాష్ట్రం మొత్తంలో ఉన్న దాదాపు పది హెరిటేజీ కంపెనీలలో భట్టిప్రోలు ఒకటి. ఇప్పటికే శాశ్వత ఉద్యోగులను హైదరాబాద్, పశ్చిమ గోదావరి, కర్నూలు వంటి ప్రాంతాలలో ఉన్న కంపెనీలకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు అందినట్లు సమాచారం.

'ఈ నెల 12 నుంచి పిల్లలకు పాఠశాలలు తెరిచారు. ఇప్పటికే పిల్లలను పాఠశాలల్లో చేర్పించాము. ఇప్పటికిప్పుడు మరో ప్రాంతానికి బదిలీ చేస్తే ఎలా వెళ్లాలి' అంటూ కొందరు ఉద్యోగానికి రాజీనామా చేసినట్లు తెలిసింది. ఇదిలావుండగా ఎప్పటి నుంచో దినసరి కూలీలుగా పనిచేస్తున్న తమను తొలగించి కంపెనీ మూసివేస్తే తాము ఎలా బ్రతకాలి అంటూ పలువురు కార్మికులు వాపోయారు. ఇక్కడ కంపెనీ ఏర్పడిన నాటి నుంచి ప్రతి ఏటా లాభాల బాటలోనే నడుస్తున్న కంపెనీని మూసివేస్తే కార్మిక చట్ట ప్రకారం కార్మికులకు కంపెనీ జీవనోపాధి కల్పించాల్సిఉందని, దానిపై ఎలాంటి చర్యలు లేకుండా అర్ధాంతరంగా మూసివేస్తే కార్మిక కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఉందని, దీనిపై కార్మిక శాఖ చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు. ఈ విషయంపై కంపెనీ మేనేజరును వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులో లేరు.

భట్టిప్రోలులో హెరిటేజ్ పాలకేంద్రం, వెల్లటూరు రోడ్డులో హెరిటేజ్ కంపెనీ బోర్డు

నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-వేటపాలెం

స్థానిక రోటరీ కమ్యూనిటీ హాల్లో ఆదివారం నిర్వహించిన ప్రోబస్ క్లబ్ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఆవుల పున్నయ్య, ఉపాధ్యక్షులుగా పల్లపోలు నాగ మనోహర్ లోహియా, కార్యదర్శిగా బూసం షణ్ముఖేశ్వరరావు కోశాధికారిగా సుబ్రహ్మణ్యం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా విశ్రాంత ఆర్జెడి స్వర్ణ ప్రయాగరావు వ్యవహరించారు. ముందుగా పోలుదాసు వెంకయ్య నాయుడు స్థానిక బండ్ల బాపయ్య హిందూ జూనియర్ కాలేజ్ వ్యవస్థాపకులు బండ్ల బాపయ్య శెట్టి జీవిత విశేషాలను సమావేశంలో తెలియజేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు వలేటి సుబ్బారావు, ఉపాధ్యక్షులు ఆవుల పున్నయ్య, కార్యదర్శి బూసం షణ్ముఖేశ్వర రావు, గొల్లపూడి సీతారాం నాగమాంబ, సభ్యులు పాల్గొన్నారు.

నూతనంగా ఎన్నికైన ప్రోబస్ క్లబ్ కార్యవర్గం

కళాశాల వారి నుంచి సన్మానం అందుకుంటున్న పూనం మాలకొండయ్య

విద్యార్థులు నమ్మకంతో చదువుకోవాలి

ఐఎఎస్ పూనం మాలకొండయ్య

ప్రజాశక్తి-పిట్టలవానిపాలెం

విద్యార్థులు విద్యార్థి దశ నుంచి తమపై తాము నమ్మకంతో చదువుకోవాలని ఐఎఎస్ డాక్టర్ పూనం మాలకొండయ్య అన్నారు. మండలంలోని ఖాజీపాలెం గ్రామంలోని కెవిఆర్, కెవిఆర్ అండ్ ఎంకెఆర్ కళాశాలలో శనివారం రాత్రి 42వ వార్షికోత్సవం సందర్భంగా ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుంచి క్రమశిక్షణతో ఉండాలని అన్నారు. అధ్యాపకులపై గౌరవంగా ఉంటే ప్రతి ఒక్కరూ తమ భవిష్యత్‌కు బాటలు వేసుకున్న వారు అవుతారన్నారు. తాను చిన్న నాటి నుంచి ఎన్నో కష్టాలు ఎదుర్కొని చివరికి అనుకున్నది సాధించానని విద్యార్థులలో స్ఫూర్తిని నింపారు. మనం ఎంచుకునే రంగంలో రాణించాలంటే నిజాయితీ, నిబద్ధత, నిస్వార్థం ఎంతో ముఖ్యమని అన్నారు. కళాశాల అధ్యక్షుడు డాక్టర్ నరస రాజు మాట్లాడుతూ విద్యార్థులకు కంప్యూటర్‌పై నైపుణ్యం పెంచటానికి సుమారు 5000 మందికి ఆన్‌లైన్ తరగతులు నిర్వహించినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఈ కళాశాల అన్ని విధాలుగా తోడ్పాటు అందించి వారి భవితకు భరోసా కల్పిస్తోందని అన్నారు. అనంతరం పలు అంశాల లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమ తులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కళా శాల వైస్ ప్రెసిడెంట్ శివరామరాజు, జాయింట్ సెక్రటరీ కృష్ణంరాజు, కళాశాల ప్రిన్సిపాల్ శివ ప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షుడు మణిలాల్

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-రేపల్లె

రేపల్లె పట్టణంలో ఓల్డ్ టౌన్ అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలో ఆశవర్కర్స్ స్థానిక సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు సిహెచ్ మణిలాల్ డిమాండ్ చేశారు. రేపల్లె స్థానిక సిఐటియు కార్యాలయంలో ఆశా వర్కర్ యూనియన్ సమావేశం యూనియన్ అధ్యక్షురాలు డి బుజ్జి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో పట్టణంలో ఆశా వర్కర్లు ఎదుర్కొంటున్న స్థానిక సమస్యలు చర్చించారు. ఈ సందర్భంగా సిఐటియు బాపట్ల జిల్లా అధ్యక్షులు, మరియు ఆశ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు సిహెచ్ మణిలాల్ మాట్లాడుతూ పట్టణంలో పెరిగిన జనాభా ప్రకారం ఆశా వర్కర్స్‌ను పెంచాలని, ఓల్డ్ టౌన్ అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలో ప్రతిరోజూ ఆశా వర్కర్ జనరల్ ఓపి ఐదుగురిని తీసుకురావాల్సిందే అనే నిబంధన వల్ల ఆశవర్కర్స్ గర్భిణులకు అందించే సేవలు, మరియు ఆశ వర్కర్ నిర్వహించాల్సిన సేవలకు ఆటంకం ఏర్పడుతోందని, కావున ఆశ వర్కర్స్‌తో సంబంధం లేని పనులు చేయించరాదని, ఓల్డ్ టౌన్ అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలో వస్తున్న స్థానిక సమస్యలను పరిష్కరించి పని ఒత్తిడి తగ్గించాలని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సరైన శెలవులు లేకపోవటంతో ఆశ వర్కర్స్ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఈ క్రమంలో పెరుగుతున్న పని ఒత్తిడి తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రేపల్లె పట్టణం పరిధిలో ఆశా వర్కర్స్ పావని, బుజ్జి, ఎస్తేర్‌రాణి, మహాలక్ష్మి, జ్యోతి, కీర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆవుల వెంకటేశ్వర్లును సన్మానిస్తున్న సంస్థ నిర్వాహకులు

ఆవుల సంక్షేమ సేవా సంస్థ ప్రారంభం

ప్రజాశక్తి-బాపట్ల

నిరుపేద అభాగ్యులైన అనాథ దీనుల సేవకు ఆవుల సంక్షేమ సేవా సంస్థలు ప్రారంభించినట్లు విశ్రాంత ఆర్మీ ఉద్యోగి, ఆవుల సేవా సంస్థ వ్యవస్థాపకులు ఆవుల వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం బాపట్ల జర్నలిస్టు వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన సంస్థ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సంస్థను మరింత విస్తరించేందుకు అధ్యక్షులుగా ఆవుల మహేష్ సారథ్యంలో కార్యకలాపాలు కొనసాగిస్తామని అన్నారు. సంస్థ నిర్వహణపై ఆవుల మహేష్ మాట్లాడుతూ సంస్థ ద్వారా సేవా కార్యక్రమాలను మరింత వేగవంతం చేసి ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరికీ సంస్థ అండగా నిలుస్తుందని అన్నారు. అందుకు స్వచ్ఛందంగా దాతలు సహకారంతో ప్రత్యేక నిధిని ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలకు కార్యాచరణ రూపొందిస్తామన్నారు. అందుకు కార్యవర్గాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సంస్థ కార్యకలాపాల నిర్వహణ గౌరవ సభ్యులుగా విశ్రాంత బ్యాంకు మేనేజర్ పి బలరామకృష్ణ, ఎన్ఎస్పి రాజు, గిరిజారాణి, రోజన్‌బాబు, సుధాకర్ (చీరాల) కమిటీ సభ్యులుగా నియమితుల య్యారన్నారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు ఆవుల వెంకటేశ్వర్లును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎన్ బాలాజీ, వై వాసు, ఎం నాగరాజు, మంచాల ఆనంద్, దేవా, శ్రీధర్, నాగూర్ షరీఫ్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

టంగుటూరులో పోలేరమ్మ దేవస్థానం కొలుపుల ఏర్పాట్లపై కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పోతుల రామారావు

టంగుటూరులో వైభవంగా పోలేరమ్మ కొలుపులు

ప్రజాశక్తి-టంగుటూరు

టంగుటూరు ప్రజలు గ్రామ దేవతగా ఆరాధించే పోలేరమ్మ తల్లి కొలుపులు ఈ నెల 17 నుంచి వైభవంగా ప్రారంభమయ్యాయి. 15 రోజులు పాటు కొలుపులను నిర్వహించేందుకు ఆలయ కమిటీ నిర్ణయించింది. ఈ నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే పోతుల రామారావు ఆదివారం పోలేరమ్మ తల్లిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పోలేరమ్మ తల్లి కొలుపుల ఏర్పాట్లు, సాంస్కతిక కార్యక్రమాలు, నిర్వహణ వ్యయం తదితర అంశాలపై కమిటీ సభ్యులతో చర్చించారు. పోలేరమ్మ తల్లి కొలుపుల నేపథ్యంలో ఈనెల 17 నుంచి దేవస్థానం వద్ద తిరునాళ్ల సందడి నెలకొంది. ఉదయం, సాయంత్రం, రాత్రి వేళల్లో భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఈ నెల 27 నుంచి 6 రోజుల పాటు గ్రామ దేవతలకు నైవేధ్యాలు సమర్పిస్తారు. ఈ సందర్భంగా పలు సాంస్కతిక కార్యక్రమాల ఏర్పాట్లలకు కమిటీ సభ్యులు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు పమిడి తులసీరావు, కమిటీ సభ్యులు పమిడి కోటయ్య పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

రవికుమార్‌ను సన్మానిస్తున్న సేవాసంస్థ సభ్యులు

ప్రజాశక్తి-శింగరాయకొండ

ఇటీవల బొమ్మారెడ్డి అవార్డు అందుకున్న ప్రజాశక్తి రిపోర్టర్ పడిదపు రవికుమార్, అమెరికాలో డాక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ కోటపాటి శేషకృష్ణను మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో జెట్టి సూర్య చంద్రశేఖర్‌రెడ్డి, కోటపాటి నారాయణ, రామలక్ష్మమ్మ, ఎం. నరసింహారావు, పాకల కోటేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు డిఎస్‌కె ప్రసాద్, శ్రీనివాసరావు, మందలపు బాబూరావు, సిఐటియు నాయకుడు టి.రామ్మూర్తి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సినీహీరో కృష్ణ విగ్రహం ఆవిష్కరణ

విగ్రహావిష్కరణలో నాయకులు

ప్రజాశక్తి- కొమరోలు

మండల పరిధిలోని వెన్నంపల్లి గ్రామంలో సినీ నటుడు సూపర్ స్టార్ కష్ణ, మహేష్ బాబు అభిమానుల సంఘం అధ్యక్షుడు కాశిరెడ్డి, అభిమానుల సంఘం ప్రెసిడెంట్ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో సినీ నటుడు కష్ణ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ విగ్రహాన్ని వైసిపి నాయకులు కామూరి రమణారెడ్డి, సూపర్ స్టార్ కష్ణ బామ్మర్ది ఉప్పలపాటి సూర్యనారాయణ బాబు ఆదివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కష్ణ అభిమానులు గ్రామస్తులు, కామూరి అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

హనుమాయమ్మ హత్య కేసులో..

ప్రభుత్వ తీరు దారుణం

- అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరావమ్మ
- నేడు కలెక్టరేట్ వద్ద ధర్నా

బాధిత కుటుంబాన్ని పమార్శిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-టంగుటూరు

పట్టపగలే ఓ అంగన్‌వాడీ కార్యకర్తను అత్యంత దారుణంగా ట్రాక్టర్‌తో తొక్కించి హత్య చేస్తే, ఆ కుటుంబం పట్ల ప్రభుత్వం తీరు అత్యంత దారుణంగా ఉందని అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కారసాల సుబ్బరావమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. టంగుటూరు పంచాయతీ పరిధిలోని రావివారిపాలెంలో ఇటీవల హత్యకు గురైన అంగన్‌వాడీ కార్యకర్త సవలం హనుమాయమ్మ కుటుంబాన్ని జిల్లా నాయకులతో కలిసి సుబ్బరావమ్మ ఆదివారం పరామర్శించారు. అనుమాయమ్మ కుటుంబ సభ్యులు నిందితుడిని కఠినంగా శిక్షించాలని నాయకుల వద్ద మొరపెట్టుకున్నారు. ఈ సందర్భంగా సుబ్బారావమ్మ మాట్లాడుతూ అధికార పార్టీ నాయకుడు అంగన్‌వాడీ కార్యకర్తను అత్యంత దారుణంగా హత్య చేస్తే ఇంతవరకూ ఆ కుటుంబ సభ్యులకు కనీసం ఓదార్పు కూడా ఇవ్వకపోవడం దారుణం కాక మరి ఏమిటని ప్రశ్నించారు. నిందితుడి పట్ల ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం నిమ్మకునీరెత్తినట్లుగా వ్యవహరిస్తుందన్నారు. హనుమాయమ్మ కుటుంబానికి ప్రభుత్వం ద్వారా రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు. కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలని ఆమె డిమాండ్ చేశారు హనుమాయమ్మ కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు సుబ్బరావమ్మ తెలిపారు. ఈ ధర్నాలో అంగన్‌వాడీలు, యూనియన్ నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీల యూనియన్ జిల్లా అధ్యక్షులు వై. సత్యవతి, శ్రామిక మహిళా కన్వీనర్ పి.కల్పన, హనుమాయమ్మ కుటుంబ సభ్యులు సవలం సుధాకర్, సిఐటియు నాయకులు వేశపోగు మోజెస్, టంగుటూరి రాము, కొల్లాబత్తిన శ్రీను, టిడిపి నాయకులు తిప్పగుడిసె రమేష్ బాబు, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు సలోమి, సుబ్బమ్మ, ధనలక్ష్మి, సరిత, పోలమ్మ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గాలి వెంకట రామిరెడ్డి

మహాధర్నాను జయప్రదం చేయాలి

రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

రైతాంగ సమస్యలపై ఈనెల 30న విజయవాడలోని ధర్నా చౌక్ వద్ద నిర్వహిస్తున్న మహాధర్నా జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గాలి వెంకటరామిరెడ్డి కోరారు. స్థానిక రైతు సంఘం కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశం వెంకటరామిరెడ్డి మాట్లాడారు. వెలుగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు ఆర్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాలన్నారు. రైతు భరోసా పథకాన్ని రైతులందరికీ వర్తింప జేయాలన్నారు. పంటల బీమా పథకాన్ని పకడ్బందీగా నిర్వహించాలన్నారు. వెలుగొండ ప్రాజెక్టును యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి రైతులకు సాగునీరు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 2022 ఖరీఫ్, రబీ సీజన్లలో అధిక, అకాల వర్షాలు, నకిలీ విత్తనాల వల్ల నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతాంగానికి అవసరమైన అన్ని రకాల నాణ్యమైన విత్తనాలు, ఎరువులు ప్రభుత్వమే పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. సున్నా వడ్డీ, పావలా వడ్డీ ఉన్న పరిమితిని పెంచి బ్యాంకుల ద్వారా రైతులందరికీ రుణాలు ఇవ్వాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల పంట రుణాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దళారీల దోపిడీ నుంచి రైతులను రక్షించేందుకై ప్రభుత్వమే మద్దతు ధరలను అమలు చేసి అన్ని రకాల పంటలను కొనుగోలు చేయాలన్నారు. మండల కేంద్రాల్లో పంట కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో అరటి రైతులను ఆదుకునేందుకు యర్రగొండపాలెం ప్రాంతంలో అరటి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్నారు. జాతీయ రహదారులు, సోలార్ ప్రాజెక్టులు, సాగునీటి ప్రాజెక్టులు, పరిశ్రమల ఏర్పాట్ల వల్ల సాగు భూములు కోల్పోతున్న రైతులు, నిర్వాసితులందరికీ 2013 భూ సేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం చెల్లించాలన్నారు. జిల్లాలో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను ఏర్పాటు చేసి రైతులను, నిరుద్యోగులను ఆదుకోవాలని కోరారు. పై సమస్యలను సిఎం దష్టికి తీసుకువెళ్లేందుకై ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చలో విజయవాడ కార్యక్రమానికి జిల్లాలోని రైతులందరూ వేలాదిగా తరలివచ్చి మహాధర్నాను జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కోటా వెంకటరెడ్డి, పక్కా ఆవులయ్య, ఉప్పలపాటి రమేష్, కందుల ప్రభాకర్, గుర్రం లక్ష్మీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

గ్రానైట్ అక్రమార్కులపై ఉక్కుపాదం

- ఫిట్‌నెస్ లేని స్కూల్ బస్సులు సీజ్
- రవాణా శాఖ ఉప కమిషనర్ సుశీల

ముఖాముఖి



ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

గ్రానైట్ అక్రమ రవాణాపై దృష్టి సారించి అక్రమార్కులపై ఉక్కుపాదం మోపుతామని రవాణా శాఖ ఉప కమిషనర్ ఆర్.సుశీల తెలిపారు. గ్రానైట్ అక్రమ రవాణాపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నారన్నారు. జిల్లాలో ఫిట్‌నెస్ లేని స్కూలు బస్సులను సీజ్ చేస్తామని హెచ్చరించారు. వాహన మిత్ర కార్యక్రమంలో ఆటో, క్యాబ్ డ్రైవర్లకు ప్రభుత్వం రూ.10 వేల ఆర్థిక సాయాన్ని అందజేస్తున్నట్లు తెలిపారు. రవాణా శాఖ ద్వారా ప్రజలు అందిస్తున్న సేవలను డిటిసి ప్రజాశక్తికి వివరించారు. అవన్నీ ఆమె మాటల్లోనే....

రవాణా శాఖ ఉప కమిషనర్ కార్యాలయం పరిధిలో మార్కాపురం, దర్శిలో యూనిట్లు ఉన్నాయి. వాటి ద్వారా రవాణా సేవలను ప్రజలకు అందిస్తున్నాం. ఆయా కార్యాలయాల పరిధిలో ఆరుగురు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు, ఒక సహాయ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఉన్నారు. ఒంగోలులో ఐదుగురు ఎంవిఐ, ఒక ఎఎంవిఐ ఉన్నారు. కలెక్టర్ దినేష్ కుమార్ ఆదేశాల మేరకు రహదారి ప్రమాదాల నివారణపై వాహనదారులు, డ్రైవర్లకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. రహదారి ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి సూచిస్తున్నాం. ఇటీవల 200 మంది పాఠశాల బస్సు డ్రైవర్లతో అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం వారికి కంటి పరీక్షలు నిర్వహించాం.

గ్రానైట్ అక్రమార్కులపై ఉక్కు పాదం

గ్రానైట్ అక్రమంగా బయటకు తరలిపోకుండా చర్యలు తీసుకుంటున్నాం. పరిమితికి మించి లోడ్ తరలిస్తున్న వాహనాలపై కేసు నమోదు చేస్తున్నాం. బ్రేక్ ఇన్‌స్పెక్టర్లు, అసిస్టెంట్ బ్రేక్ ఇన్‌స్పెక్టర్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్స్ నిరంతరాయంగా పర్యవేక్షిస్తూ ఓవర్ లోడ్ వాహనాలను గుర్తించి కేసులు నమోదు చేసి జరిమానాలు విధిస్తున్నారు.

ఫిట్‌నెస్ లేని స్కూల్ బస్సుల సీజ్

విద్యా సంవత్సరం ప్రారంభం కావటంతో పాఠశాలల బస్సులపై ప్రత్యేక దృష్టి సారించాం. స్కూల్ బస్సు ఫిట్‌నెస్ లేకపోతే సీజ్ చేస్తున్నాం. జిల్లాలో ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్ బస్(ఇబిఐ)లు 1,085 ఉన్నాయి. అందులో 790 బస్సులను పరిశీలించాం. మరో 295 బస్సులను పరిశీలించాల్సి ఉంది. ఫిట్‌నెస్ సర్టిఫికెట్(ఎఫ్‌సి) లేకపోతే ఆ బస్సులను సీజ్ చేస్తున్నాం.

వాహన మిత్ర లబ్ధిదారులకు నగదు అందజేత

వైఎస్ఆర్ వాహన మిత్ర పథకం ద్వారా ఆటో, క్యాబ్ డ్రైవర్లకు ఇప్పటి వరకు నాలుగు విడతలుగా రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం వారి ఖాతాలలో జమ చేశారు. జిల్లాలో ఆటో, క్యాబ్ యజమానులు, డ్రైవర్లు కలిపి మొత్తం 40.479 మందికి నేరుగా వారి బ్యాంకు ఖాతాలలో రూ. 40.47 కోట్లు జమ అయింది. ఐదో విడత వాహన మిత్ర కార్యక్రమానికి లబ్ధిదారుల జాబితాలు సిద్ధం చేస్తున్నాం.

100 శాతం లక్ష్యాల సాధన

రాష్ట్ర ప్రభుత్వం రవాణా శాఖకు నిర్ధేశించిన పన్నులు, ఫీజుల లక్ష్యాలను 100 శాతం సాధిస్తున్నాం. ఇందుకు సహకరిస్తున్న రవాణా శాఖ అధికారులు, సిబ్బంది, ముఖ్యంగా ప్రజలకు అభినందనలు తెలియజేస్తున్నాం.

వాహనాల లైసెన్సుల సరళీకరణ

వాహనం నడిపే వారికి లైసెన్సు తప్పనిసరి. ద్విచక్ర, త్రిచక్ర, నాలుగు చక్రాల వాహనదారులకు లైసెన్సులు అందజేస్తున్నాం. ఎల్‌ఎల్‌ఆర్ కోసం దరఖాస్తు చేసుకున్న వాహనదారులకు పరీక్ష నిర్వహించి లైసెన్సు ఇస్తున్నాం. రవాణా శాఖ పరిధిలో లైసెన్సులు, పర్మిట్లు ఆన్‌లైన్‌లోనే జరుగుతున్నాయి. వాహనాల రిజిస్ట్రేషన్ డీలర్ వద్దే జరగటంతో డిజిటల్ నెంబర్ ప్లేట్లు వాహనాల యజమానులకు అందజేస్తున్నాం. అందరి సహకారంతో రానున్న కాలంలో రవాణా శాఖ ద్వారా ప్రజలకు అందించే సేవలను మరింత సులభంగా, వేగవంతంగా అందించేందుకు కృషి చేస్తాం.